ప్రజాశక్తి
సోమవారం 27 మార్చి 2023 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

సుప్రీం తీర్పుపై ఉత్కంఠ

రాజధానిపై రేపటి నుంచి సుప్రీం కోర్టు విచారణ

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

రాజధాని అమరావతిపై సుప్రీంకోర్టులో మంగళవారం నుంచి విచారణ జరగనుంది. రాజధాని అమరావతిలో మార్పులు చేయరాదని, మాస్టర్‌ప్లాన్ ప్రకారం యథాతథంగా అభివృద్ధి చేయాలని, సిఆర్‌డిఎ చట్టం రద్దు చెల్లదని, రైతులకు అభివృద్ధి చేసిన రిటర్నబుల్ ప్లాట్‌లను ఆరు నెలల్లోగా అప్పగించాలని రాష్ట్ర హైకోర్టు గత మార్చిలో ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. హైకోర్టు తీర్పు ఇచ్చిన ఆరు నెలల తరువాత ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేయగా ఈ అంశంపై రైతులు, కేంద్ర ప్రభుత్వం, వివిధ రాజకీయపార్టీల అభిప్రాయాలను కోరిన సుప్రీంకోర్టు తన విచారణను ఈనెల 28న ప్రారంభిస్తామని ప్రకటించింది. త్వరగా విచారణ చేయాలన్న ప్రభుత్వ అభ్యర్ధనను కూడా సుప్రీంకోర్టు ఇటీవల తోసిపుచ్చింది. ఈ నేపథ్యంలో రైతులు తరుపున ఇప్పటికే పలు అఫిడవిట్‌లు దాఖలయ్యాయి. కేంద్ర ప్రభుత్వం కూడా తన తన అఫిడవిట్ దాఖలు చేసింది. రాజధానిని అభివృద్ధి చేయకపోతే తమ ప్లాట్‌లకు ధరలు ఎలా వస్తాయన్నదీ రైతులు ప్రశ్నిస్తున్నారు. రాజధానికి భూములు ఇస్తే మీకు ఎంతో మేలు జరుగుతుందని గత ప్రభుత్వం రైతులకు ఆశపెట్టింది.

2015లో భూములు తీసుకున్న అప్పటి ప్రభుత్వం 2018 నాటికి అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇవ్వాల్సి ఉంది. గత ప్రభుత్వం ఇవ్వలేదు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత ఏమాత్రం పట్టించుకోలేదు. ఇప్పుడు తమ పరిస్థితి తల్లకిందులైంది. భూ సమీకరణలో భూములిచ్చిన దాదాపు 24 వేల మంది రైతులతో పాటు 29 గ్రామాల పరిధిలో భూములు కొని పెట్టుబడి పెట్టి తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్నారు. 2019 డిసెంబరు 17న శాసనసభలో సిఎం జగన్ మూడు రాజధానుల ప్రకటనతో 29 గ్రామాల్లో రైతుల ఆశలపై నిళ్లుచల్లినట్టు అయ్యింది. 2019 డిసెంబరు 18 నుంచి ఉద్యమానికి అమరావతి ఐక్య కార్యచరణ సమితీ పిలుపునిచ్చింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు

2లో

శంకుస్థానపలో డాక్టర్ వాసిరెడ్డి రమేష్‌బాబు, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఇతర అతిథులు, నాయకులు

సేవాతత్పరత.. పోరాట బాట..

- చైతన్య స్ఫూర్తి.. ప్రగతిశీల భావాల వ్యాప్తి..
- బహుముఖ కార్యక్రమాలకు విజ్ఞాన కేంద్రం వేదికవ్వాలి
- పల్నాడు ప్రాంత అభివృద్ధికి దిక్సూచిగా నిలవాలి
- విశాల దృక్పథంతో ఆలోచనలు సాగించి పరిష్కారాలు చూపాలి
- పల్నాడు విజ్ఞాన కేంద్రానికి శంకుస్థాపనలో అతిథులు

4లో

పురస్కారం, సత్కారాన్ని అందుకుంటున్న రాజేంద్రప్రసాద్

నట కిరీటికి నట సార్వభౌముని పురస్కారం

ఎన్టీఆర్ చలనచిత్ర పురస్కారాన్ని అందుకున్న రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి-తెనాలిరూరల్

నందమూరి బాలకృష్ణ సారథ్యంలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, సినీ రచయిత బొర్రా సాయి మాధవ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ శకపురుషుడు ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక ఎన్విఆర్ కళ్యాణ మండపంలో ఆదివారం సినీ నటుడు, నటకిరీటి రాజేంద్రప్రసాద్ ఎన్టీఆర్ చలనచిత్ర పురస్కారం అందుకున్నారు. పురస్కారాన్ని ఎన్టీఆర్ నందమూరి రాంప్రసాద్ ప్రదానం చేయగా ఎన్టీఆర్ జ్ఞాపిక, పురస్కారాన్ని రాజేంద్రప్రసాద్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ పురష్కారాన్ని అందుకోవడం గర్వంగా ఉందని సన్మాన గ్రహీత

2లో

కన్నా ఇంటికి రాయపాటి!

- సమావేశమైన టిడిపి ఉమ్మడి గుంటూరు జిల్లా నేతలు
- వైసిపి పాలనపై ధ్వజం
- ఉమ్మడి జిల్లాలోని అన్ని సీట్లనూ గెలుస్తామని ధీమా

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

కన్నా లక్ష్మీనారాయణ నివాసంలో సమావేశమైన నాయకులు

ఇటీవల టిడిపిలో చేరిన మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ నివాసంలో ఆదివారం మధ్యాహ్నం టిడిపి నేలు భేటి అయ్యారు. ఉమ్మడి జిల్లా టిడిపి నేతలకు ఆయన విందు ఏర్పాటు చేశారు. టిడిపిలో చేరిన తరువాత ఆయన తొలిసారిగా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు, ముఖ్యనాయకులను తన నివాసానికి ఆహ్వానించారు. రాజకీయంగా ప్రత్యర్థులుగా ఉన్న కన్నా-రాయపాటి సుదీర్ఘకాలం తరువాత ఆదివారం భేటి కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే కన్నాను ఓడిస్తామని ఇటీవల మాజీ ఎంపి రాయపాటి సాంబశివరావు ప్రకటించిన నేపథ్యంలో ఆయన సోదరుడు శ్రీనివాస్ కన్నా ఇంటికి రావడం చర్చనీయాంశమైంది. కన్నా కూడా ఆయన్ను ఆప్యాయంగా ఆహ్వానించారు. సమావేశం ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చించారు. రాబోయే ఎన్నికలకు సన్నద్ధం కావడంపై ఇక మీదట తరచూ ఇలా భేటి కావాలని నిర్ణయించారు.

ఈ సందర్భంగా నాయకులంతా మీడియాతో మాట్లాడారు. మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ వైసిపి నేతల అరాచకాలకు, అవినీతి, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడాలని నిర్ణయించామన్నారు. జగన్ నమ్ముకుంటే భవిష్యత్తు లేదని చాలా మంది నేతలకు

2లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సోమవారం సాయంత్రం) : 6.25

సహరీ (మంగళవారం ఉదయం) : 4.50

'చలో ఢిల్లీ' జయప్రదం కోసం ప్రచారం

ప్రజాశక్తి - యడ్లపాడు

కార్మిక, కర్షక సమస్యల పరిష్కారం కోసం వచ్చేనెల 5వ తేదీన నిర్వహించే చలో ఢిల్లీని జయప్రదం చేయాలని కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ కోరారు. ఈ మేరకు మండలంలోని లింగారావుపాలెంలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ పంటలకు మద్దతు ధరల చట్టం చేయాలని, వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్లను పెట్టొద్దని, వ్యవసాయాన్ని రక్షించాలని, ఎరువుల ధరలను తగ్గించాలని, తదితర సమస్యలతోపాటు కార్మికుల హక్కుల కోసమూ చలోఢిల్లీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి అన్ని రంగాల ప్రజలు తరలిరావాలని కోరారు.

అచ్చెన్నాయుడు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-నరసరావుపేట

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు పుట్టినరోజు వేడుకలను స్థానిక టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. కేక్‌ను కట్‌చేసిన అరవింద బాబు కార్యకర్తలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు కె.బ్రహ్మయ్య, ఎస్.మారుతి, మహమ్మద్ రఫీ, షేక్ నాగూర్, వి.శివ, టి.నరసింహారావు పాల్గొన్నారు. **కారెంపూడి:** స్థానిక టిడిపి కార్యాలయంలో అచ్చెన్నాయుడు పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. టిడిపి పట్టణ అధ్యక్షులు కె.బాలకృష్ణ, టి.మస్తాన్ జాని, కృష్ణ, జానిబాష, శ్రీను, బాలుɴాయక్, పేరయ్య, ఎం.శ్రీను, కె.లక్ష్మయ్య, బి.పవన్ పాల్గొన్నారు.

'జగన్ పాలనలో మద్యం ఏరులై పారుతోంది'

ప్రజాశక్తి - చిలకలూరిపేట

స్థానిక 27వ వార్డులోని రాగన్నపాలెం జమ్మిచెట్టు వద్ద టిడిపి ఆధ్వర్యంలో మాటామంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. మాజీ కౌన్సిలర్ నల్లమోతు వెంకాయమ్మ, తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జరినా సుల్తానా మాట్లాడారు. జగన్ పాలనలో మద్యం ఏరులై పారుతోందని, ఇది మహిళలపై దాడులకు దారితీస్తోందని అన్నారు. ఇలాంటి పాలన అంతానికి మహిళలు నడుంకట్టాలని పిలుపునిచ్చారు. ఎ.రమాదేవి, పి.లక్ష్మి, ఎ.అనిత భాయి పాల్గొన్నారు.

గిరిజనులకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోం

ప్రజాశక్తి - బెల్లంకొండ

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే విషయమై అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్లు టిడిపి ఎస్టీ సెల్ నాయకులు నుంసావత్ హనుమంతరావు నాయక్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన జారీ చేశారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి ఓటమి కోసం ఎస్టీలు కృషి చేస్తారని, జీవో 52ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

జనరేటర్ల మెకానిక్‌ల జీవనం అగమ్యగోచరం!

ప్రజాశక్తి-చిలకలూరిపేట

రాష్ట్రంలో పలు జిల్లాల్లో వున్న ఆక్వా (రొయ్యలు, చేపల) చెరువులకు జనరేటర్లను అద్దె కిచ్చే చిలకలూరిపేటలోని మెకా నిక్‌లకు జీవనోపాధి కరువైంది. కరోనా తర్వాత, ఆక్వా పంటకు రోగాల తోనూ, ధరలు లేక రైతులు క్రాప్‌హాలిడేను ప్రక టించడంతో జనరేటర్ల పై ఆధారపడి బతుకుతున్న వేల మందికి ఆదాయం లేక కుటుంబాలు గడవని పరిస్థితి. ఈ పరిశ్రమపై ఆధారపడ్డ ఆరు రకాల వృత్తుల వాళ్లు ఎలక్ట్రీషియ న్, మెకానిక్, ఆటోమొబైల్ షాపులు, రిపేర్ చేసే వర్కర్లు, కాపలాదారులు, జీపులను సరఫరా చేసే వాళ్ల ఆర్థికపరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పట్టణంలోనూ, సమీప గ్రామాల్లో ఉన్న మెకానిక్‌లు ఆక్వా చెరువులకు కొన్ని సంవత్సరాలుగా జనరేటర్లను సరఫరా చేస్తున్నారు. కరోనాకే ముందు దాదాపు రాష్ట్రం మొత్తం చిలకలూరిపేట నుంచి ఆక్వా చెరువులకు,వర దల సమయంలోను, మరెక్కడైనా నీరు తోడే వాటికి జనరేటర్లను సరఫరా చేసే వారు. ప్రస్తుతం పట్టణంలో ఈ తరహారేనరేటర్లు సుమారు మూడు నాలు గువేల ఉన్నట్లు సమాచారం. ఒక్కొక్క జనరేటర్ హార్స్ పవర్ ను అనుసరించి సుమారు లక్ష నుంచి 3 లక్షల ఖరీదైన జనరేటర్లను కాంట్రాక్టులకు పంపుతున్నా మంటున్నారు. హార్స్ పవర్‌ను అనుసరించి ఒక్కో జనరేటర్‌కు రూ.8 వేల నుంచి రూ.30 వేల వరకు అద్దెలు వస్తుంటాయని చెప్పారు. వీటిపై ఆధారపడ్డ వారికి సుమారు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు జీతాల రూపంలో, రిపేర్లు, ఇతర ఖర్చులు సుమారు రూ.5 వేలు పోయిన ఒక్కొక్క జన రేటర్ కు నెలకు పది వేల వరకు మిగులుతుందని చెబుతున్నారు. చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక, ప్రస్తుతం జనరేటర్లు పని చేయక నానాఅవస్థలు పడుతున్నామని వాటి యజమానులు చెబుతున్నారు. నియోజకవర్గ, మండల పరిధిలో ని పలువురు యజమానుల పరిస్థితి ఇదే విధంగా ఉంది.మండల పరిధిలోని ఒక్క పోతవరంలో 30,125 హార్స్ పవర్ గల జనరేటర్లు ఇంటికి రెండు నుంచి నాలుగు జనరేటర్ల చొప్పున సుమారు 600 వందల వరకు ఉన్నాయి. శ్రీహరికోట నుంచి గోదావరి జిల్లాల వరకు గల సముద్ర తీరం వెంబ టి ఆ క్వా చెరువుల రైతులకు ఈ జనరేటర్లను అద్దెలకు ఇచ్చే వారమని వారు చెబుతున్నారు. రొయ్యలు, చేప లకు నిరంతరం ఆక్సిజన్ అందించే రేడియేటర్లకు ఈ జనరేటర్ల ద్వారా ఆక్సిజన్

వసుమర్తి రోడ్డు ప్రక్కన నిలిచిపోయిన జనరేటర్లు

సరఫరా అవు తుందని, అందుకనే వీటికి అంత డిమాండ్ ఉందని అన్నారు. కరోనా తర్వాత ధరలు లేక ఎగు మతులు భారీగా తగ్గిపోవడంతో ఆక్వా సాగుకు క్రాప్ హాలి డే ప్రకటించడంతో ఈ జనరేటర్ల పై ఆధారపడిన వారికి జీవనోపాధి లేకుండా పోయింది. ప్రస్తుతం జనరేటర్లు నిరుపయోగంగా మారాయని పోతవరం గ్రామానికి చెందిన సుభాని అన్నారు. తనకు 4 జనరేటర్లు వున్నాయని, ప్రతినెల ఒక్కో జనరేటర్ ద్వారా దాదాపు రూ.8 వేల నుంచి రూ.25 వేల వరకు సంపాదించేవాడినని చెప్పారు. జనరేటర్లకు, చెరువుల కు కాపలాగా ఇద్దరు, ముగ్గురు ఉండే వారని, ప్రస్తుతం పనులు లేక అందరూ ఖాళీగా ఉంటున్నామన్నారు. ప్రభుత్వం వారు ఆక్వా రంగానికి చేయూత నిస్తే దానిపై ఆధారపడ్డ తాము ఆర్థికంగా కోలుకుంటామని అన్నారు. జనరేటర్లు వున్న వారికి వడ్డీ లేని బ్యాంకు రుణాలు ఇప్పించాలని కోరారు. ప్రస్తుతం పట్టణంలో అద్దెలు చెల్లిస్తున్నామని ఆటోనగర్ ను వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.



నట కిరీటికి నట సార్వభౌముని పురస్కారం

(మొదటి పేజీ తరువాయి)

రాజేంద్రప్రసాద్ అన్నారు. ఎన్‌టిఆర్ తనను ఆలింగనం చేసుకొని తెలుగు చిత్ర సీమకు పరిచయం చేసారని గుర్తు చేసుకున్నారు. తనను నటుడిగా సినీ ప్రపంచానికి పరిచయం చేసిన మహానటుని చలనచిత్ర పురస్కారం తెనాలిలో అందుకోవడం సంతోసంగా ఉందని చెప్పారు. అతిథులుగా హాజరైన మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, సినీ పాత్రికేయులు అంబటి సురేంద్రరాజు, నిర్మాత ఎస్.గోపాల్‌రెడ్డి, పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, నందమూరి చిత్రశాల ప్రసాద్, కొమ్మినేని వెంకటేశ్వరరావు, విస్సు తదితరులు మాట్లాడారు. 10 మాసాలుగా ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలు తెనాలిలో నిర్వహించడం అభినందనీయమన్నారు.

సుప్రీం తీర్పుపై ఉత్కంఠ

(మొదటి పేజీ తరువాయి)

విరామం లేకుండా 1195 రోజులుగా రైతులు తమ ఆందోళనను వివిధ రూపాల్లో కొనసాగిస్తున్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో 33,700 ఎకరాల భూమిని భూ సమీకరణ ద్వారా రైతులు సిఆర్‌డిఎకు ఇచ్చారు. అందుకు ప్రతిగా అభివృద్ధి చేసిన ప్లాట్లును ఇస్తామని అప్పటి ప్రభుత్వం చెప్పింది. మూడేళ్లలోగా అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇస్తామని సిఆర్‌డిఎ చట్టంలో పేర్కొన్నారు. అయితే టిడిపి హయాంలో ఈ రైతులకు కాగితాల్లో ప్లాట్లు ఇచ్చినా వాటిని అభివృద్ధి చేయలేదు. ఈ లోగా ప్రభుత్వం మారింది. 2019 మే 30న అధికారంలోకి వచ్చిన సిఎం జగన్ రాజధాని అభివృద్ధిపై దృష్టి సారించకపోగా అదే ఏడాది డిసెంబరు 17న మూడు రాజధానుల ప్రకటన 29 గ్రామాల్లో కలకలం రేపింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు రాజధాని ప్రాంత రైతులు పోరాడుతున్నారు. మార్చి నెలలో హైకోర్టు తీర్పు మేరకు రాజధానిని అభివృద్ధి చేయకుండా మళ్లీ మూడు రాజధానుల నినాదాన్ని అందుకున్నారు. అవకాశం వచ్చినప్పుడుల్లా విశాఖ నుంచి త్వరలో పరిపాలన చేస్తామని ప్రకటిస్తు న్నారు. అంతేగాక హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టులో స్టే తెచ్చుకుని విశాఖకు వెళ్లాలని సిఎం జగన్ ఆరు నెలలుగా ప్రయత్నిస్తున్నారు. సుప్రీంకోర్టులో స్టేరాకపోవడంతో విశాఖ పట్నం నుంచి పాలన సాగించాలనే సిఎం జగన్ ఆలోచన నెరవేరడం లేదు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టులో విచారణ జరిగి తీర్పు ఎలా వస్తుందోనని రైతులు ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు.

కన్నా ఇంటికి రాయపాటి!

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికే అర్థమైందని అన్నారు. పులివెందులలోనే గ్రాడ్యుయేట్లు ఓట్లు టిడిపికి పడ్డాయని గుర్తు చేశారు. జగన్ ఓటమి పులివెందుల నుండి ప్రారంభమైందని, ముందస్తు ఎన్నికలకు వెళ్లాలనుకున్న జగన్ ఇప్పుడు భయపడుతున్నాడని ఎద్దేవ చేశారు. ముందస్తు ఎన్నికలకు వెళితే వైసిపిలో తిరుగుబాటు వస్తుందన్నారు. రాజధాని అమరావతిని వ్యతిరేకించిన వైసిపి నుంచి పోటీ చేస్తే ఆ పార్టీ అభ్యర్థులకు కృష్ణా, గుంటూరు జిల్లాల్లో డిపాజిట్లు రావన్నారు. పల్నాడు జిల్లా అధ్యక్షుడు జివి ఆంజినేయులు మాట్లాడుతూ వచ్చే ఎన్నికలకు ఏ విధంగా ముందుకు వెళ్ళాలన్నది చర్చించామని, 17 స్థానాలకు 17 స్థానాలు గెలుస్తామని అన్నారు. అందరం కలిసి వైసిపిని గద్దె దించుతామన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా విజయం మాదేనని తెలిపారు. మాజీ మంత్రి నక్కా ఆనంద్ బాబు మాట్లాడుతూ పులివెందులలోనే సిఎం ఓడిపోతారని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలతో వైసిపి ఓటమి ప్రారంభమయిందన్నారు. సజ్జల వలన తనకు ప్రాణ భయం ఉందని ఉండవల్లి శ్రీదేవి చెప్పినట్లు గుర్తు చేశారు. వైసిపిలో తిరుగుబాటు మొదలైందన్న ఆయన ఎవరికి ఎవరు ఓటు వేశారో సజ్జలకు ఎలా తెలుసని ప్రశ్నించారు. టిడిపి ఎమ్మెల్యేలను ఎంతిచ్చి కొన్నారని? ఉండవల్లికి జరిగిన అవమానం ఎవరికైనా జరిగిందా? అని ప్రశ్నించారు. దళితుల్లోనూ పెయిడ్ ఆర్టిస్టులను తయారు చేసి దళితులపైనే ఎదురు దాడి చేయిస్తున్నారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాస్ మాట్లాడుతూ ఏపీ రాజకీయులు బాలనాగమ్మ కథను తలపిస్తున్నాయన్నారు. మాయల్ పకీర్ పని అయిపోయిందన్నారు. అలవిగాని హామీలతో సిఎం జగన్ అధికారంలోకి వచ్చారని, బాబాయ్ కేసు తాడేపల్లి నివాసంలోకి వచ్చే పరిస్థితి ఉందని విమర్శించారు. దెందులూరులో సిఎం నోట 175 మాటలు రాలేదన్నారు. శ్మశానంలో పుట్టిన పార్టీ వైసిపి అన్నారు. పోలీసు అధికారులు ఇకనైనా కళ్ళు తెరవాలని సూచించారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ సిఎంకు శాసన మండలిపై నమ్మకం లేదని, సిఎం పట్టభద్రుల ఓటర్‌గా కూడా నమోదు చేసుకోలేదని తెలిపారు. దేశంలోనే ధనవంతుడైన ముఖ్యమంత్రి జగనేనని అన్నారు. ఎమ్మెల్యేలను ప్రశ్నించే హక్కు జగన్‌కు లేదన్నారు. కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పోలీసుల మీద ఆధారపడి రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని, ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నారని వైసిపిపై ధ్వజమెత్తారు. పోలీస్ వ్యవస్థ నిబద్ధతతో పనిచేస్తే శాంతిభద్రతలు సక్రమంగా ఉంటాయన్నారు. పోలీసులు రాజ్యాంగబద్ధంగా పని చేయాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్సీ పర్చూరి అశోక్‌బాబు, టిడిపి నాయకులు కొమ్మాలపాటి శ్రీధర్, బుచ్చిరాం ప్రసాద్, డేగల ప్రభాకర్, బ్రహ్మారెడ్డి, నశీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కన్నా లక్ష్మినారాయణతో టిడిపి నాయకులు

ఆ చోరీ పనిమనుషుల పనే!

చోరీ కేసులో ఇద్దరు నిందితులు అరెస్ట్ -రూ.20 లక్షల ఆభరణాలు స్వాధీనం

ప్రజాశక్తి-తెనాలి

వివరాలు వెల్లడిస్తున్న డిఎస్పీ, వెనుక వరుసలో నిందితులు(ముసుగులో)


స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

నాలుగేళ్లుగా ఎంతో నమ్మకంగా పనిచేస్తున్నారు. వృద్ధ దంపతులకు ఆసరాగా నిలిచారు. యజమానులు కూడా వారిని పూర్తిగా నమ్మారు. వారికి శాశ్వత ప్రాతిపదికన ఆశ్రయం కల్పించారు. కాని డబ్బు, నగలు వారిలో దుర్బుద్ధిని రేకెత్తించింది. అంతే దర్జాగా ఇంట్లో నగదు, బంగారాన్ని అపహరించారు. అపహరణను గుర్తించిన ఇంటి యజమానులు పోలీసులను ఆశ్రయించటంతో పని మనుషుల గుట్టురట్టయింది. నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు దొంగతనం వివరాలను వెల్లడించారు. పట్టణ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో డిఎస్పీ కె.స్రవంతిరాయ్ ఆదివారం వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక ఐతానగర్‌కు చెందిన నన్నపనేని హేమలత, దుర్గా ప్రసాద్ దంపతులు వృద్ధులు కావటంతో వారికి కుటుంబ సభ్యులు పనిమనుషులను ఏర్పాటు చేశారు. పట్టణానికి చెందిన రమావత్ చాందిని, కృష్ణ దంపతులు పనిమనుషులుగా నాలుగేళ్లుగా ఆ ఇంట్లో నమ్మకంగా పనిచేస్తున్నారు. వృద్ధ దంపతుల ఆలనాపాలనా చూసుకుంటూ, ఇంటి వారి నమ్మకాన్ని కూడగట్టుకున్నారు. ఈ నేపథ్యంలో పని మనుషులకు ఎంతగానో నమ్మిన కుటుంబ సభుయలు అదే ఇంటి ఆవరణలో ప్రత్యేకంగా స్థావరాన్ని కూడా వారికి ఏర్పాటు చేశారు. వృద్ధుల ప్రతి అడుగును గమనిస్తున్న పనిమనుషులు ఇంట్లో నగదు, బంగారం ఉన్నట్టు గుర్తించారు. అనుకూలమైన సమయం కోసం వేచి చూసి, బీరువాలో కొంత నగదు, బంగారాన్ని అపహరించి మౌనంగా ఉండిపోయారు. ఈనేపథ్యంలో ఈనెల 11న ఇంటికి వచ్చిన యజమాని కుమారుడు పవన్‌కృష్ణ బీరువాలో ఓ గుడి నిర్మాణం కోసం ఉంచిన రూ . 5లక్షల నగదును పరిశీలించారు. దానిలో రూ.40వేలు తగ్గినట్లు గుర్తించి, తల్లిని ప్రశ్నించాడు. అయితే తనకేమీ తెలియదని చెప్పటంతో, ఇంట్లో ఉన్న బంగారాన్ని కూడా పరిశీలించారు. బంగారు అభరణాలు కూడా అపహరణకు గురైనట్లు గుర్తించి, పట్టణ టూటౌన్ పోలీసులకు పిర్యాదు చేశారు. ఈనెల 21న దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈలోగా పనిమనుషులిరువురూ పని మానేసి వెళ్ళిపోవటంతో వారిపై అనుమానం వచ్చిన పోలీసులు, వారిని శనివారం రాత్రి అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించారు. దీంతో నగదు, బంగారం అపహరించినట్లు చెప్పటంతో, వారిని అరెస్ట్ చేశారు. వారి నుంచి అపహరణకు గురైన రెండు బంగారు బిస్కెట్లు, తొమ్మిది గాజులు, మూడు చైన్లు, రెండు ఉంగరాలను స్వాదీనం చేసుకున్నారు. స్వాదీనం చేసుకున్న సొత్తు విలువ రూ.20లక్షలు ఉంటుందని డిఎస్పీ వెల్లడించారు. కేసును ఎంతో చాకచక్యంగా చేధించిన సిఐ ఎస్.వెంకట్రావ్, ఎస్ఐ నాగేశ్వరరావు, క్రైమ్ సిబ్బందిని ఆమె ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో సిఐ, ఎస్ఐ, పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

పంట నష్టపోయిన అందరికీ పరిహారం

ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-రొంపిచర్ల

అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం తప్పకుండా చెల్లిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలో విప్పర్లపల్లి, వడ్లమూడివారిపాలెం, సుబ్బయ్యపాలెం, తురుమెళ్ల గ్రామాల్లో ఆయన ఆదివారం పర్యటించారు. వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న, మిర్చి, అరటి, వరి పంటలను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో వెయ్యి ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేయగా వర్షాలకు పంట దెబ్బతిందని చెప్పారు. పంట నష్టంపై వ్యవసాయ శాఖాధికారులతో సమీక్షించి రైతులు, కౌలురైతులకు పరిహారం దక్కేలా చూస్తామన్నారు. 30వ తేదీ వరకూ వ్యవసాయాధికార్లు పంటలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేస్తారని, పరిహారాన్ని మూడు నెలల్లో చెల్లిస్తామని చెప్పారు. మండలంలోని విప్పర్లపల్లి అగ్రహారం భూములకు రైత్వారీ పట్టాలు ఇచ్చేందుకు కృషి చేస్తామని, ఆ భూముల్లో దెబ్బతిన్న పంటలకూ నష్టపరిహారం చెల్లించేలా ప్రయత్నిస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి పి.ఓబుల్ రెడ్డి, మార్కెట్ యార్డు ఛైర్మన్ పి.రవీంద్రబాబు, సర్పంచులు జి.రామిరెడ్డి, జి.మాణిక్యం, వైసిపి నాయకులు పి.శివారెడ్డి, ఎ.పున్నారెడ్డి, కె.శ్రీనివాసరావు, బి.కోటిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని విమర్శించే అర్హత శ్రీదేవికి లేదు

వైసిపి తాడికొండ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్

ప్రజాశక్తి-గుంటూరు

వైసిపి నుండి వెలివేయబడిన తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని విమర్శించే అర్హత లేదని తాడికొండ నియోజక వర్గ వైసిపి సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రిపై, పార్టీపై శ్రీదేవి చేసిన విమర్శలను ఆయన తీవ్రంగా ఖండించారు. బడుగు బలహీన వర్గాలకు సముచిత స్థానం ఇచ్చి, పదవులు కట్టబెట్టి, అందలమెక్కించిన సిఎం జగన్మోహన్‌రెడ్డిని విమర్శించటం ఏరు దాటిన తర్వాత తెప్ప తగలేసిన చందంగా ఉందని విమర్శించారు. దాచుకో, దోచుకో, పంచుకో అనే పదాలు ఎవరికి వర్తిస్తాయో ఒకసారి వెనుతిరిగి చూసుకోవాలని అన్నారు. పదవిలో ఉన్నంతకాలం జగన్మోహన్‌రెడ్డి నా గుండె చప్పుడు, నా గుండె జగన్ జగన్ అని కొట్టుకుంటుంది అని చెప్పి అవినీతి, అక్రమాలకు పాల్పడి పార్టీ నుండి వెలివేయబడిన తర్వాత విమర్శలు చేయడం సరికాదన్నారు. అంగన్వాడి, ఆయా, పోస్టుల నుండి బదిలీలు, నియామకాలు, నామినేటెడ్ పోస్టులకు ఎంతెంత వసూలు చేసిన విషయం అందరికీ తెలిసిన బహిరంగ రహస్యమేనని అన్నారు. ఇళ్ల స్కామ్ చేసింది ఎవరో, దాని ద్వారా కోట్ల రూపాయల లబ్ది పొందింది ఎవరో అందరికీ తెలుసన్నారు. సిఎంను విమర్శిస్తే సహించేద లేదన్నారు.

తుళ్లూరులో ఎమ్మెల్యే శ్రీదేవి దిష్టిబొమ్మ దహనం

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని గ్రామం తుళ్లూరులో తులసీ సినిమా థియేటర్ సెంటరులో ఆదివారం స్థానిక ఎమ్మెల్యే వుండవల్లి శ్రీదేవి దిష్టిబొమ్మను వైసిపి నాయకులు, కార్యకర్తలు దహనం చేశారు. నమ్మక ద్రోహి శ్రీదేవి అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఎస్ సందీప్, మేకల రవి, బి శివారెడ్డి, బెజ్జం రాంబాబు, చుండు వెంకటరెడ్డి, ఆలూరి శ్రీనివాసరావు ఆలోకం సురేష్, కొప్పుల శేషగిరి రావు, టి రమణా రెడ్డి, ఎం.చెన్న కేశవులు, ఆరేపల్లి జోజి పాల్గొన్నారు.

గాయాల పాలైన బెజవాడ శ్రీనివాస్

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-విజయపురిసౌత్

రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయ పడిన సంఘటన మాచర్ల మండలం పసువేముల గ్రామ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే పశువేముల గ్రామానికి చెందిన బెజవాడ శ్రీనివాస్ ద్విచక్ర వాహనం పై మాచర్ల వెళ్తుండగా పసువేముల సమీపంలోని సూరమ్మ చెరువు వద్ద ఎపి 39 టివి3934 నంబరు గల అశోక లేలాండ్ వాహనంలో వెళ్తున్న డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయాగా శ్రీనివాస్ ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం అశోక లేలాండ్ వాహనానికి వెనుక నుంచి ఢీ కొట్టింది. దీనితో బెజవాడ శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని మాచర్ల ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రధమ చికిత్స అనంతరం నరసరావుపేట ఏరియా హాస్పిటల్‌కి రిఫర్ చేశారు.

రవికిరణ్ హత్యకేసు సమగ్ర నివేదిక ఇవ్వండి

జిల్లా ఎస్పీని ఆదేశించిన హైకోర్టు

హత్య కేసుపై హైకోర్టుకు లేఖ రాసిన అంబేద్కర్ ఇంటలెక్చ్యువల్ ఫోరం

ప్రజాశక్తి-తెనాలి:

మాట్లాడుతున్న నాగరాజు, ధర్మారావు తదితరులు

హత్యకేసు విచారణలో పోలీసుల వైఫల్యంపై రాసిన లేఖపై హైకోర్టు స్పందించింది. జిల్లా ఎస్పీకి సమగ్ర నివేదికకు ఆదేశించింది. బాపట్ల జిల్లా అమృతలూరు మండలం మూల్పూరు గ్రామానికి చెందిన మూల్పూరు రవికిరణ్ గతేడాది 20న హత్యకు గురైన నేపథ్యంలో అతని మృతదేహాన్ని కూడా పోలీసులు గుర్తించలేకపోవటం తెలిసిందే. ఈ పరిస్థితిపై దుగ్గిరాల మండలం చిలువూరుకు చెందిన అంబేద్కర్ ఇంటలెక్చ్యువల్ ఫోరం ఫౌండర్, న్యాయవాది చిలువూరు నాగరాజు ఈ ఏడాది జనవరి 28న హైకోర్టుకు లేఖ రాశారు. దీనిపై హైకోర్టు స్పందించి, కేసు విచారణపై తక్షణ చర్యలు తీసుకోవాలని, యాక్షన్ టేకెన్ రిపోర్టు పంపాలని జిల్లా ఎస్పీని ఆదేశించారు. దీనిపై రూరల్ గ్రామం కొలకలూరు బాబు జగజ్జీవన్‌రామ్ రీడింగ్ రూమ్ వద్ద ఆదివారం నాగరాజు మాట్లాడుతూ రవికిరన్ హత్య కేసులో పోలీసులు మొదటి నుంచి నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారని, ఫలితంగా మృతదేహాన్ని సైతం కనుగొనలేకపోయారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో కేసు సమగ్ర విచారణ కోరుతూ హైకోర్టుకు లేఖ రాయటంతో స్పందించి, జిల్లా ఎస్పీకి అత్యవసర నోటీసులు పంపినట్లు వెల్లడించారు. బాధిత కుటుంబానికి పరిహారంగా రూ.25లక్షలు, ఐదెకరాల భూమినివ్వాలని లేఖలో కోరినట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్ నాయకులు ఉన్నం ధర్మారావు మాట్లాడుతూ కేసులో అధికారులు, పోలీసుల వైఫల్యాన్ని గతంలోనే పలుమార్లు ప్రశ్నించామన్నారు. ఇప్పటికైనా ఉన్నత న్యాయస్థానికైనా పోలీసులు వాస్తవాలను వెల్లడించి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. సమావేశంలో రవికిరణ్ కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF THE XXVI ADDL. CHIEF JUDGE CUM-MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL, CITY CIVIL COURTS, AT :: HYDERABAD

M.V.O.P.NO.272 OF 2022

Between:
Smt. A.Sakri & 4 others
...Petitioners
AND
Sri Harinadha Reddy Gatla & 2 others
...Respondents

To
R1
Sri Harinadha Reddy Gatla S/o. Venkateswara Reddy, Aged 27 years, Occ: Driver of Car (Maruthi Swft) Vehicle bearing No. TS 07 GD 5420, R/o. H.No. 5-1-473, Lane 1, Nehru Nagar, Macharla, Guntur Dist.,A.P.- 522 426

NOTICE

Take Notice that the above claimants filed above OP for compensation against you. The case is posted to 10-04-2023 for your appearance. Hence appear before the above said Court on **10-04-2023** at **10.30** am or else the matter will be decided as per law.

(BY ORDER OF THE COURT)

C.S. Choudary, M.A., B.L.,
Advocate
H.No.13-6-439/1/A/29, Balai Nagar, Gudimalkapur,Hyderabad-500 006, Telangana State.

IN THE HON'BLE COURT OF THE XI ADDL. CHIEF JUDGE CUM-MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL, CITY CIVIL COURTS, AT :: HYDERABAD

M.V.O.P.NO.2215 OF 2022

Between
Sri K.Srinivas & another
...Petitioners
AND
Sri Lakkimsetty Nageswara Rao & 2 others
...Respondents

To
R1
Sri Lakkimsetty Nageswara Rao S/o. Venkateswara Rao, aged 41 years Occ: Driver of vehicle Lorry bearing No. AP 07 J 1549, R/o. H.No. 3-23-74/3, 11th Line, Pedda Cheruvu, Guntur, Andhra Pradesh-522 601.

NOTICE

Take Notice that the above claimants filed above OP for compensation against you. The case is posted to 20-04-2023 for your appearance. Hence appear before the above said Court on **20-04-2023** at **10.30** am or else the matter will be decided as per law.

(BY ORDER OF THE COURT)

C.S. Choudary, M.A., B.L.,
Advocate
H.No.13-6-439/1/A/29, Balaji Nagar, Gudimalkapur Hyderabad - 500 006, Telangana State.

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జడ్జి మహమ్మద్ గౌస్

పోలీసు జట్టుపై లాయర్ల జట్టు విజయం

క్రికెట్ మ్యాచ్‌లో 11 పరుగుల తేడాతో గెలుపు

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

శారీరక ధృఢత్వం, మానిసక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని అదనపు జూనియర్ సివిల్ జడ్జి అబ్దుల్‌గౌస్ అన్నారు. స్థానిక శరభయ్య క్రీడా ప్రాంగణంలో పోలీసులు-లాయర్ల క్రికెట్ మ్యాచ్‌ను ఆదివారం నిర్వహించగా ముఖ్యఅతిథిగా జడ్జి అబ్దుల్‌గౌస్ హాజరయ్యారు. తొలుత టాస్ గెలిచిన లాయర్ల జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 15 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 129 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పోలీసులు 15 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 118 పరుగులే చేయటంతో లాయర్ల 11 పరుగులతో విజేతగా నిలిచింది. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.లింగారెడ్డి, ఎపిపి బి.నరసింహారావు, సీనియర్ న్యాయవాదులు అబ్దుల్ రహీమ్, మణిబాబు, డి.శ్రీనివాస్, పి.వెంకటకోటయ్య, జి.అజయ్‌కుమార్, నరసింహశాస్త్రి, కె.సాంబశివరావు పాల్గొన్నారు.

సత్కారం పొందుతున్న కరిముల్లా

కవి కరిముల్లాకు గుర్రం జాషువా స్మారక పురస్కారం

ప్రజాశక్తి - వినుకొండ

వినుకొండకు చెందిన ప్రముఖ కవి కరిముల్లాకు అద్దంకిలో జరిగిన బహిరంగ సభలో జానపద కళాపీఠం తరుపున పద్మభూషణ గుర్రం జాషువా స్మారక పురస్కారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కవి దేవపాలన మాట్లాడుతూ మహాకవి గుర్రం జాషువా తరువాత వినుకొండ గడ్డ నుండి పేదలు, అభాగ్యుల పక్షం వహించి తెలుగు సాహిత్యంలో తనదైన శైలిలో ముద్ర వేసిన గొప్ప కవి కరీముల్లా అని అన్నారు. మతసామరస్యానికి కట్టుబడి అస్థిత్వ ఉద్యమానికి నాంది పలికి అబాబీలు అనే నూతన కవితా ప్రక్రియను ఆవిష్కరించారని చెప్పారు. కరీముల్లా కవిత్వంపై ఇప్పటికే అనేక యూనివర్సిటీల్లో పరిశోధనలు జరుగుతున్నాయని, ఆయన కవితలు ఆంగ్లం, కన్నడం, హిందీ, ఉర్దూ, ఒరియా భాషల్లో తర్జుమా అవటంతో అంతర్జాతీయ గుర్తింపు వచ్చిందని అన్నారు. కరిముల్లాకు న్యాయవాదులు పిజె.లూకా, ఎస్‌కె.సిద్ధయ్య, చిత్రకారుడు వజ్రగిరి జస్టిస్, గాయకుడు పిఎస్.రాజు శుభాకాంక్షలు తెలిపారు.

సేవాతత్పరత.. పోరాట బాట..

- చైతన్య స్ఫూర్తి.. ప్రగతిశీల భావాల వ్యాప్తి..
- బహుముఖ కార్యక్రమాలకు విజ్ఞాన కేంద్రం వేదికవ్వాలి
- పల్నాడు ప్రాంత అభివృద్ధికి దిక్సూచిగా నిలవాలి
- విశాల దృక్పథంతో ఆలోచనలు సాగించి పరిష్కారాలు చూపాలి
- పల్నాడు విజ్ఞాన కేంద్రానికి శంకుస్థాపనలో అతిథులు

సభలో మాట్లాడుతున్న డాక్టర్ వాసిరెడ్డి రమేష్‌బాబు, గుంటూరు విజయ్‌కుమార్, పిన్నమనేని మురళికృష్ణ, పాశం రామారావు, వి.కృష్ణయ్య, మారుతివరప్రసాద్, చింతలపూడి గంగయ్య

శంకుస్థాపనలో ఎ.బాగేశ్వరిదేవి, గద్దె చలమయ్య

ప్రజాశక్తి - నరసరావుపేట

రాజకీయాలకు అతీతంగా ప్రజాసేవతోపాటు బహుముఖ కార్యక్రమాలు, ప్రగతిశీల భావాల వ్యాప్తికి విజ్ఞాన కేంద్రాలు కృషి చేస్తున్నాయని, అదే వరవడిని పల్నాడు విజ్ఞాన మరిత విస్తృతంగా కొనసాగించాలని పలువురు ఆకాంక్షించారు. వెనకబడిన పల్నాడు ప్రాంతంలో అభివృద్ధికి కృషి చేయడంతోపాటు సమస్యల పరిష్కారం కోసం సాగే పోరాటాలకూ విజ్ఞాన కేంద్రం దిక్సూచిగా నిలవాలని అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని కోటప్పకొండ రోడ్డులో పల్నాడు విజ్ఞాన కేంద్రం భవనానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు విజ్ఞాన కేంద్రం కోశాధికారి ఎ.లక్ష్మీశ్వరరెడ్డి అధ్యక్షత వహించగా అతిథులను తొలుత వేదికపైకి విజ్ఞాన కేంద్ర ట్రస్ట్‌బోర్డు చైర్మన్ గుంటూరు విజయ్‌కుమార్ ఆహ్వానించారు. ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్రంలో అనేకచోట్ల ఇప్పటికే విజ్ఞాన కేంద్రాలు నెలకొల్పిల అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజల్లో ప్రశ్నించే తత్వాతన్ని పెంచడం, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంలో కృషి చేస్తున్నాయన్నారు. సేవా సంస్థలు అనుసంధానంతో ప్రజాసేవలో అంకితమయ్యాయన్నారు. వివిధ అంశాలపై రాజకీయాలకతీతంగా సదస్సులు, అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని, ప్రగతిశీల భావాల వ్యాప్తికి పాటుపడుతున్నాయని చెప్పారు. పల్నాడు ప్రాంతంలో 800 ఏళ్ల క్రితమే బ్రహ్మానాయుడు కుల, మతాలకు అతీతంగా అందరూ ఒక్కటే అని చాపకూడు పెట్టారని గుర్తు చేశారు. అలాంటి ఈ ప్రాంతంలో ఆర్థిక, విద్య, వైద్య రంగాల్లో ఎంతగానో వెనుకబడిందని అన్నారు. మాచర్ల, దుర్గి, నకరికల్లు, వెల్దుర్తి తదితర 10 మండలాల్లో 58 శాతం అక్షరాస్యతే ఉందని, ఈ పరిస్థితి బీహార్ రాష్ట్రంలో కూడా లేదని ఆవేదన వెలిబుచ్చారు. రాష్ట్రంలో అత్యధికంగా విద్యార్థులు కలిగిన పాఠశాలలు పల్నాడు ప్రాంతంలో ఉన్నాయని, పిడుగురాళ్ల హైస్కూల్లో 2400 మంది, వినుకొండ బాలికల హైస్కూల్లో 1200 మంది ఉన్నారని, అయినా పలు పాఠశాలలు ఉపాధ్యాయుల కొరతతో ఇబ్బంది పడుతున్నాయని తెలిపారు. వ్యవసాయ ఆధారితమైన ఈ ప్రాంతంలో మిర్చి అధికంగా సాగవుతున్నా మిర్చియార్డు మాత్రం కలగానే మిగిలిందని, 2010లో దుర్గి వద్ద అప్పటి సిఎం కొణిజేటి రోశయ్య శంకుస్థాపన చేసినా అనంతరం ఎవరూ పట్టించుకోలేదని అన్నారు. మాచర్ల ప్రాంతంలో పీజీ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఎప్పటి నుండో పోరాడుతున్నట్లు గుర్తు చేశారు. పల్నాడు ప్రాంతానికి మణిహారమైన అయిన వరికపూడిసెల ప్రాజెక్టు నిర్మాణానికి అన్ని పార్టీలు, సంఘాలు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. ఈ అన్ని అంశాల్లో అధ్యయనం, పోరాటానికి పల్నాడు విజ్ఞాన కేంద్రం కేంద్ర బిందువు కావాలని ఆకాంక్షించారు.

బాలోత్సవాల వ్యవస్థాపకులు డాక్టర్ వాసిరెడ్డి రమేష్‌బాబు మాట్లాడుతూ 15 వేల మంది విద్యార్థులతో 25 ఏళ్లుగా బాలోత్సవాలు నిర్వహించామని, పిల్లల్లోని సృజనాత్మకతను వెలికితీయడానికి బాలోత్సవాలు మంచి వేదికలని చెప్పారు. అయితే అలాంటి కార్యక్రమాలు లేక ఎంతో మంది పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని, వారికి విజ్ఞాన కేంద్రం దన్నుగా నిలిచి ప్రోత్సహించాలని సూచించారు. బాలోత్సవాలు లాంటి కార్యక్రమాలు పల్నాడు జిల్లాలో విజ్ఞాన కేంద్రం ద్వారా చేపట్టాలని, అందుకు తాము సహకరిస్తామని చెప్పారు. విజ్ఞాన కేంద్రాల రాష్ట్ర సమన్వయ కమిటీ కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా బాలోత్సవాలు, యువజనోత్సవాలు, మహిళా ఉత్సవాలు నిర్వహించడం విశాల ప్రజానీకం కోసమేనన్నారు. నూతన ఆవిష్కరణలు, శాస్త్ర విజ్ఞానం ప్రజలకు ఉపయోగపడాలని, వివక్ష సమసిపోయి అందరికీ అవకాశాలు, అందరి అభ్యున్నతికి దోహదపడే పరిస్థితుల సాధనకు విజ్ఞాన కేంద్రాలు పాటుపడాలన్నారు. విశాలమైన భావాలతో చర్చలకు, సమస్యల పరిష్కారానికి దిక్సూచిలా విజ్ఞాన కేంద్రాలు నిలుస్తాయన్నారు. కరోనా కాలంలో విజ్ఞాన కేంద్రాల్లో ఐసోలేషన్ సెంటర్ల నిర్వహణ ద్వారా ప్రజలతో ఏర్పడిన అనుబంధాన్ని గుర్తు చేశారు.

గుంటూరులోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం ట్రస్టీ పాశం రామారావు మాట్లాడుతూ కరోనా కాలంలో విజ్ఞాన కేంద్రాల్లో నిర్వహించిన ఐసోలేషన్ కేంద్రంలో ఎంతో మంది సేవలు పొందారని, దాతలూ అనేక రకాలుగా సహకారం అందించారని చెప్పారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారికి శిక్షణా ఇచ్చామని పలు అనుభవాలను పంచుకున్నారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ వ్యవసాయ సాంకేతికతలను అంచనా వేయడం, ప్రదర్శించడం, రైతులకు సలహాలు ఇవ్వడం విజ్ఞాన కేంద్రాల బాధ్యత కావాలన్నారు. రైతుల సమస్యలకు పరిష్కారాలను సూచిస్తూ సాగులో ఖర్చు తగ్గించి అధిక ఉత్పత్తులు సాధించడానికి, రైతుల రాబడి పెంచడానికి అవసరమైన చర్యల్లో విజ్ఞాన కేంద్రం భాగస్వామ్యం కావాలని కోరారు. యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు, విజ్ఞాన కేంద్రం కార్యకలాపాల నిర్వహణ కమిటీ కన్వీనర్ ఎ.బాగేశ్వరిదేవి మాట్లాడుతూ ఇప్పటికే పలు ప్రాంతాల్లోని విజ్ఞాన కేంద్రాలను యువత సద్వినియోగం చేసుకుంటున్నారని, పల్నాడు విజ్ఞాన కేంద్రాన్నీ అదేవిధంగా యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ కమిటీ సభ్యులు ఏపూరి గోపాలరావు, వై.రాధాకష్ణ, జి.రవిబాబు, ఎస్.ఆంజనేయ నాయక్, విజ్ఞాన కేంద్రం కార్యకలాపాల కన్వీనర్ మస్తాన్‌వలి, ప్రజా సంఘాల నాయకులు సిలార్ మసూద్, ఇ.మస్తాన్‌రెడ్డి, డి.శివకుమారి, కె.రామారావు, ఎన్.సుందరరావు, ఎం.అశోక్, సిఐటియు బాపట్ల జిల్లా ఉపాధ్యక్షులు చింతలపూడి గంగయ్య, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి జి.జనార్ధన్‌బాబు, సిపిఐ జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్, నాయకులు కె.రాంబాబు, ఉపాధ్యాయులు, మేధావులు, పట్టణ ప్రముఖులు, ప్రజా సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.

సభ, శంకుస్థాపనకు హాజరైన వివిధ సంఘాల నాయకులు, అతిథులు

చలోఢిల్లీ జయప్రదం కోసం ప్రచారం

ప్రజాశక్తి-ముప్పాళ్ల

కార్మిక, కర్షక సమస్యల పరిష్కారం కోసం, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజ్యాతిరేక విధానాలకు వ్యతిరేకంగా 5వ తేదీన నిర్వహించే చలోఢిల్లీని జయప్రదం చేయాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు కరపత్రాలను మండలంలోని నార్నెపాడులో ఆదివారం పంపిణీ చేసి ప్రచారం చేశారు. రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు జి.బాలకృష్ణ మాట్లాడుతూ వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేలా కేంద్రం కుట్రలు పన్నుతోందని, మరోవైపు కార్మికుల హక్కులను కాలరాస్తోందని చెప్పారు. ఈ విధానాలను తిప్పికొట్టడానికి అన్ని రంగాల ప్రజలూ చలోఢిల్లీకి తరలిరావాలని కోరారు. ప్రచారంలో నాయకులు ఎన్.సాంబశివరావు, కె.ప్రభాకర్, మస్తాన్‌రావు, ఐ.శ్రీను, సిహెచ్.నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

5న చలోఢిల్లీని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-గుంటూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని స్థానిక స్వర్ణభారతి నగర్‌లో సిఐటియు నాయకులు, కార్యకర్తలు ఆదివారం కరపత్రాలు పంపిణీ చేశారు. వేలాది కరపత్రాలు పంపిణీ చేస్తూ, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, వాటి ప్రమాదాల గురించి వివరించారు. కార్యక్రమంలో సిఐటియు గుంటూరు నగర పశ్చిమ ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు, నగర నాయకులు షేక్.మస్తాన్‌వలి, ఆది నికల్సన్, షేక్.ఖాసిం షహీద్, పి.శ్రీనివాసరావు, ఎస్.పద్మనాభుడు, రంగా షేక్.బాషా, లూథర్‌పాల్, మల్లేశ్వరి, ముస్తాక్ అహ్మద్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, కార్మిక కర్షక సంఘాల ఆధ్వర్యంలో ఏప్రిల్ 5వ తేదీన ఢిల్లీలో జరుగు కార్మిక కర్షక ర్యాలీని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు కోరారు. ఆదివారం ఎంటీఎంసీ పరిధిలోని ప్రాతూరు గ్రామంలో రైతు సంఘం నాయకులు కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతాంగ విధానాలకు వ్యతిరేకంగా, కార్మిక చట్టాలను కాలరాస్తూ, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తూ పరిపాలన చేస్తుందని అన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని, వ్యవసాయ రంగాన్ని కాపాడాలని కోరుతూ దేశవ్యాప్తంగా మతోన్మాద బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు వెల్లువెత్తుతున్నాయి అని అన్నారు. వ్యవసాయ రంగాన్ని నీరుగారిచ్చేందుకు మూడు నల్ల చట్టాలు తెచ్చి, రైతాంగాన్ని అనేక ఇబ్బందులు పాలు చేస్తుందని ఆయన విమర్శించారు. కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు, దేశ సంపదను బడా పారిశ్రామికవేత్తలకు అప్పనంగా దోచిపెట్టేందుకే నరేంద్ర మోడీ ప్రభుత్వం పని చేస్తుందని ఆయన దుయ్య బట్టారు. మతోన్మాది బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏప్రిల్ 5వ తేదీన దేశవ్యాప్తంగా ఢిల్లీ కేంద్రంలో రైతులు కార్మికులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపట్టారని అన్నారు. ఈ కార్మిక కర్షక నిరసన ర్యాలీని జయప్రదం చేసేందుకు ప్రజలందరూ మద్దతు తెలపాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి, డోకిపర్తి రాజేంద్ర బాబు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డోకిపర్తి కోటయ్య, అంబేద్కర్ యూత్ నాయకులు సంకూరు నాని, డోకిపర్తి ఏసు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చేబ్రోలు

కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక, రైతాంగ, ఉద్యోగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమంలో కార్మికులు, ప్రజలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ కార్మికులకు పిలుపునిచ్చారు. చేబ్రోలు మండలంలోని కొత్త రెడ్డిపాలెం చెన్నారెడ్డి కాలనీ, ఇందిరా కాలనీలో ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పి కొట్టకపోతే కార్మికుల మనుగడ ప్రమాదంలో పడుతుందని అన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, పంటలకు గిట్టుబాటు ధర చట్టాన్ని తేవాలని, వ్యవసాయానికి బడ్జెట్లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్ హనుమంతరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిరంతరాయంగా పెంచుతున్న పెట్రోల్, డీజిల్, ధరలు వల్ల నిత్యవసర వస్తువుల కొనుగోలపై ప్రభావం పడుతుందని, ప్రజలు పెరుగుతున్న ధరలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమం సిఐటియు నాయకులు ఆదిశేషువు, ఇట్టి ఆదినారాయణ, రవి పాల్గొన్నారు.

ప్రజాశక్తి -మేడికొండూరు

మోడీ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఎప్రిల్ 5న చలో ఢిల్లీ జయప్రదం చేయాలని కోరుతూ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. తురకపాలెం ప్రచారంలో రైతు సంఘం నాయకులు బి రామకృష్ణ మాట్లాడారు.

మేడికొండూరులో

ప్రాతూరులో ప్రచారం

చేబ్రోలులో

గుంటూరులో

గుంటూరులో

31న ధర్నాను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

ఎస్సీ వర్గీకరణ బిల్లు చట ్టబద్ధత కల్పించాలని లక్ష్యసాధనలో భాగంగా ఎమ్మార్పీఎస్ వ్యవ స్థాపక అధ్యక్షులు కృష్ణ మాదిగ పిలుపు మేరకు ఆదివారం ప్రత్తిపాడు మండల కేంద్రంలోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద అత్య వసర సమావేశం ఎమ్మా ర్పీఎస్ సీనియర్ నాయకులు దున్న సాంబయ్య అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రత్తి పాడు నియోజకవర్గ కన్వీనర్ తోడేటి ఏసు పాదం మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలో వర్గీకరణకు అనుకూలంగా ఆ రాష్ట్ర ముఖ్య మంత్రి క్యాబినెట్ ఆమోదంతో పాటు కేంద్ర ప్రభుత్వానికి సిఫా ర్సు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఎపి ప్రభుత్వం కూడా వర్గీకరణపై స్పష్టమైన హామీ ఇవ్వాలని అన్నారు. మార్చి 31న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా, ఏప్రిల్ 3న రాష్ట్ర బిజెపి కార్యాలయం వద్ద ధర్నా, ఏప్రిల్ 4 న విజయనగరం ముట్టడి కార్యక్రమాలు ఉంటాయని, వీటిని విజయవంతం చేయాలని కోరారు. సీనియర్ నాయకులు అంకయ్య మాదిగ, డి.మాతయ్య, ఎం.రవి, కె.మీరయ్య, ఎం.రత్నరాజు, పి.దేవదానం పాల్గొన్నారు.

వెల్డింగ్ మిషన్లు పంపిణీ

ప్రజాశక్తి-మంగళగిరి: స్థానిక ఇస్లాంపేటకు చెందిన షేక్ ఇబ్రహీం, షేక్ అబ్దుల్లాలకు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సహ కారంతో ఆదివారం వెల్డింగ్ మిషన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ కార్యదర్శి షేక్ రియాజ్, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ మజీద్, నియోజవర్గ కార్యదర్శి షేక్ సుభాని, పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీపై వేటు తొందరపాటు చర్య

ప్రజాశక్తి - గుంటూరు

కాంగ్రెస్ అగ్రనేత రాహూల్ గాంధిని లోక్‌సభ సభ్యత్వానికి అనర్హుడుగా ప్రకటిస్తూ సెక్రటరీ జనరల్ నోటిఫికేషన్ జారీ చేయడం బిజెపి కేంద్ర ప్రభుత్వ దుర్మార్గానికి తాజా తార్కాణమని వక్తలు పేర్కొన్నారు. ఆదివారం అవగాహన సంస్థ కార్యాలయంలో రాహూల్‌పై వేటు తొందరపాటు చర్య అంశంపై విద్యావేత్త సిహెచ్ అనంతరామయ్య మాట్లాడుతు సూరత్‌లో ఒక జిల్లా మేజిస్ట్రేట్ ఇచ్చిన తీర్పును ఆఘమేఘాలమీద అమలు చేయడం విపరీతమేనన్నారు. ఆర్‌వి సింగరయ్య మాట్లాడుతు పైకోర్టుకు వెళ్లడానికి కోర్టు నెల రోజుల ఇస్తూ శిక్ష అమలును నిలిపివేసిందని, నేర నిర్ధారణ అలానే ఉంచిందన్నారు. కార్యక్రమంలో ఎన్ సందాశివం, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కారాన్ని అందుకుంటున్న సాయి

ఫొటోగ్రాఫర్ సాయికి జాతీయ అవార్డు

ప్రజాశక్తి - గన్నవరం

గన్నవరం మండలం దావాజిగూడెం గ్రామానికి చెందిన డి. జి ఎం.ఎన్. సాయి కుమార్ ఆదివారం తిరుపతి యూత్ హాస్టల్‌లో నిర్వహించిన సభలో ఫొటోగ్రఫీ రంగంలో జాతీయ స్థాయి ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందిన వే ఫౌండేషన్ అధ్వర్యంలో నిర్వహించిన సభలో విశిష్ట అతిధి ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ రీజినల్ డైరెక్టర్,తిరుపతి హబ్ ఎపి.టి.డి.సిఎగ్జికూటివ్ డైరెక్టర్ డా.రావూరి రమణ ప్రసాద్,నిర్వాహకులు చేతులు మీదుగా సాయి పురస్కారం తీసుకున్నారు. ఈ సందర్భంగా సాయి మాట్లాడుతూ తమ వంటి కళాకారులను గుర్తించి ప్రోత్సహించిన వే ఫౌండేషన్ కమిటీ,వారికి తన ఉన్నతికి నిరంతరం ప్రోత్సహిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

కళ తప్పిన మున్సిపల్ కార్యాలయం

ప్రజాశక్తి-తాడేపల్లి

దాతలు ఎంతో ఔదార్యంతో కోటి రూపాయలు ఇప్పించి నిర్మించిన తాడేపల్లి మున్సిపల్ కార్యాలయం ప్రజలు లేక వెలవెలబోతోంది. గతంలో తాడేపల్లి మేజర్ పంచాయతీగా ఉన్న సమయంలో, తాడేపల్లి,కృష్ణనగర్‌ను కలిపి మున్సిపాలిటిని చేసిన సందర్భంలో వివిధ అవసరాలతో వచ్చే ప్రజలతో నిత్యం కళకళలాడేది. రెండేళ్ల క్రితం మంగళగిరి, తాడేపల్లి మున్సిపాలిటీలను కలిపి కార్పొరేషన్‌గా ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. కార్పొరేషన్ అయిన తర్వాత ప్రధాన కార్యాలయం మంగళగిరికి వెళ్లిపోయింది. పనులన్నీ అక్కడి నుంచే జరుగుతున్నాయి. దీంతో, వివిధ పనుల కోసం తాడేపల్లి రూరల్ గ్రామాలకు సంబంధించిన 8 గ్రామాల ప్రజలు, రాజధానిలో భాగమైన పెనుమాక, ఉండవల్లి, వివిధ పనుల కోసం మంగళగిరికి వెళ్లాల్సి రావడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. అక్కడికి వెళితే ఏ అధికారిని కలవాలో తెలియక, పనులు జరగక తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తాడేపల్లిలో కోటి రూపాయలతో నిర్మించిన మున్సిపల్ కార్యాలయం ప్రజలు లేక కళ తప్పింది. ప్రతి పనికి మంగళగిరికి వెళ్లాల్సి రావడంతో అదనపు సమయంతో పాటు, ఛార్జీల రూపల రూపంలో అదనపు భారం పడుతోందని వినియోగదారులు వాపోతున్నారు. బిల్డింగ్ ప్లాన్లు అప్రూవల్ కావాలన్నా, ఇతర ఏ అవసరమున్నా, మండలంలోని మారుమూల గ్రామాల ప్రజలైతే 10 నుండి 12 కిలోమీటర్ల దాకా ప్రయాణం చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. ఒకప్పుడు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు దగ్గరలో ఉన్న తాడేపల్లి కార్యాలయానికి వచ్చి, తమ పనులు చక్కబెట్టుకునే వారు. ఇప్పుడా పరిస్థితి లేదు.

తాడేపల్లిలో జోనల్ కార్యాలయమైనా ఏర్పాటు చేయాలి : సిపిఎం

పట్టణ ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని వివిధగ్రామాల ప్రజల అవసరాలను త్వరితగతిన పూర్తి చేసుకునే విధంగా తాడేపల్లిలో ప్రస్తుతం ఉన్న కార్యాలయాన్ని మున్సిపల్ జోనల్ కార్యాలయంగా మార్చాలని సిపిఎం జిల్లా సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, తాడేపల్లి సిపిఎం పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో కోరారు. తాడేపల్లికి ఉన్న ప్రాధాన్యత రీత్యా అధికారులు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలోనే విశాఖపట్టణం తర్వాత అతిపెద్ద కార్పొరేషన్ అని ప్రభుత్వం ప్రకటించిన ఎంటిఎంసి మున్సిపల్ కార్యాలయంకు సంబంధించిన తాడేపల్లిలో జోనల్ కార్యాలయం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని నాయకులు తెలిపారు.

గొడవలు కాదు.. పిల్లల చదువులపై శ్రద్ధ పెట్టండి..

- ప్రజలకు పోలీసుల సూచనలు
- పలు గ్రామాల్లో పల్లెనిద్ర
- సమస్యలపై స్థానికులతో పోలీసుల సమావేశాలు

వెల్దుర్తి మండలంలోని గ్రామాల్లో ప్రజలతో మాట్లాడుతున్న పోలీసులు

ప్రజాశక్తి - మాచర్ల

గొడవల్లో తలదూర్చకుండా పిల్లలను జాగ్రత్తగా చదివించుకుని శాంతియుత జీవనం గడపాలని వెల్దుర్తి మండలం రచ్చమల్లపాడు, రాయవరం ప్రజలకు పోలీసులు సూచించారు. పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా రచ్చమల్లపాడులో సిఐ సమీముల్లు, వెల్దుర్తి ఎస్ఐ శ్రీహరి, రాయవరంలో మాచర్ల రూరల్ ఎస్ఐ రాజశేఖర్ శనివారం రాత్రి పర్యటించారు. ఈ సందర్భంగా వారు గ్రామస్తులతో మాట్లాడుతూ విద్యతోనే కుటుంబం, సమాజం అభివృద్ధి సాధ్యమయవుతుందని చెప్పారు. కక్షలు, కార్పణ్యాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా పిల్లల చదువులపై దృష్టిపెట్టాలని, వారికి మంచి భవిష్యత్‌ను అందిం చాలని సూచించారు. చిన్నచిన్న విషయాలకే గొడవలు పెట్టుకుని సాధించేది ఏమీ ఉండదని అన్నారు. కార్యక్రమంలో ఎంపిటిపి వెంకటరామయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రొంపిచర్ల

మండలంలో అత్యంత సమస్యాత్మక గ్రామమైన అలవాలలో శనివారం రాత్రి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో నరసరావుపేట డీఎస్పీ విజయభాస్కరరావు పర్యటించి స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ పారిశుధ్య, రెవెన్యూ సమస్యలను ప్రజలు తమ దృష్టికి తెచ్చారని, సంబంధిత అధికారులకు ఈ విషయాలు తెలియజేస్తామని చెప్పారు. ప్రజలు రాజకీయ పార్టీలకు అతీతంగా స్నేహభావంతో మెలగాలని, వివాదాల జోలికెళ్లకుండా శాంతియుత జీవనం గడపాలని సూచించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో బస చేశారు. నరసరావుపేట రూరల్ సిఐ భక్తవత్సలరెడ్డి, ఎస్ఐ సురేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి - నూజెండ్ల

మండలంలోని ములకలూరులో పోలీసులు శనివారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ విజయ్ భాస్కర్‌రావు, రూరల్ సిఐ రమేష్‌బాబు, ఎస్ఐ అనిల్‌కుమార్ హాజరయ్యారు. సిఐ మాట్లాడుతూ గ్రామంలో ప్రజలు స్నేహపూర్వకంగా ఉండాలని, ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఇరు పక్షాలకు చెందిన పెద్దలు ముందుగా మాట్లాడుకుని సమన్వయంతో పరిష్కరించుకోవాలని సూచించారు. అయినా సమస్యలు పరిష్కారం కాకుంటే పోలీసుల దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.బాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రొంపిచర్ల మండలం అలవాలలో పర్యటిస్తున్న నరసరావుపేట డీఎస్పీ విజయభాస్కరరావు, సిఐ,ఎస్ఐ

నూజెండ్ల మండలం ములకలూరులో స్థానికులతో పోలీసుల సమావేశం

ఎమ్మెల్యేను సత్కరిస్తున్న అప్పాపురం గ్రామస్తులు

ఆగ్రహార భూముల రైతులకు త్వరలోనే పట్టాలు : ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు

ప్రజాశక్తి-నూజెండ్ల

మండలంలోని అప్పాపురంలోని అగ్రహారం భూములకు రీసర్వే పూర్తయిందని, త్వరలోనే పట్టాలను రైతులకు అందిస్తామని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చెప్పారు. వినుకొండలో ఆయన్ను ఆదివారం కలిసి సత్కరించిన గ్రామస్తులతో ఆయన మాట్లాడారు. మండలంలోని మరికొన్ని గ్రామాల్లోని అగ్రహారిక భూములకు సర్వే ప్రక్రియ జరుగుతోందని, వారికీ పట్టాలు పంపిణీ చేస్తామని అన్నారు.

పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఉదయ్ హాస్పిటల్స్ ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని ఆరేపల్లి ముప్పాళ్లలో ఉదయ్ హాస్పిటల్స్ గుంటూరు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఈపూరు సొసైటీ పర్సన్ ఇంచార్జ్ బొల్లా వెంకట రాధాకృష్ణ ప్రారంభించగా ప్రముఖ వైద్యులు ఆకుల శివప్రసాద్ వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఈసీజీ, 2డి, ఎకో పరీక్షలు చేసి మందులను ఉచితంగా అందించారు. వైద్యులు ఆకుల రమేష్, వేమూరి నరేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగ విలువలను అపహాస్యం చేస్తున్న బిజెపి

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్యాన్ని బిజెపి అపహాస్యం చేస్తోందని అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు జిల్లేళ్ల పాల్‌రాజ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన జారీ చేశారు. ప్రశ్నించే ప్రతిపక్ష పార్టీలపై ఇడి, సిబిఐ లాంటి సంస్థలను ప్రయోగిస్తూ అక్రమ కేసులు బానాయిస్తున్నారని, రాహుల్‌గాంధీని ఎంపీగా అనర్హుణ్ణి చేయడం అందులో భాగమని విమర్శించారు. దేశం ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసిన అదానీ వ్యవహారంపై సిఐటి, ఇడి ఎందుకు దర్యాప్తు చేయవని ప్రశ్నించారు.

వైసిపి నుండి టిడిపిలోకి

ప్రజాశక్తి - నూజెండ్ల

మండలంలోని చింతలచెరువుకు చెందిన కందుల కృష్ణారెడ్డి, గుమ్మ చిన్న అబ్బాయి తదితరులు వైసిపి నుండి టిడిపిలో చేరారు. వీరిని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ఎం.మురళీకృష్ణ యాదవ్, నాయకులు వి.పేరయ్య, ఎం.సుబ్బారావు, జి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో వైసిపి అసమర్ధపాలన : టిడిపి

ప్రజాశక్తి-నరసరావుపేట

విలేకర్లతో మాట్లాడుతున్న మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు. పక్కన జీవీ ఆంజనేయులు కొమ్మలపాటి శ్రీధర్,చదలవాడ అరవిందబాబు తదితరులు

తిరుమల తిరుపతిలో గంజాయి లభ్యమవడం, అసాంఘిక కార్యక్రమాలు జరుగుతుండడం వైసిపి ప్రభుత్వ అసమర్ధ పాలనకు నిదర్శనమని మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు విమర్శించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్, నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులతో కలిసి పుల్లారావు ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో అకాల వర్షాలకు 3 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పంట నష్టాన్ని అధికారులు ఇంకా సిద్ధం చేయలేదని, వ్యవసాయంపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇది నిదర్శనమని అన్నారు. జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ వైసిపి హయాంలో అప్పులు, అరాచకాలు పరిపాటయ్యాయని, టిడిపి హయాంలో కట్టిన భవనాలకు వైసిపి రంగులు వేయడం, వివిధ కార్యక్రమాలకు పేర్లు మార్చడం మినహా కొత్తగా చేసిందేమీ లేదన్నారు. వరికపూడిసెల ప్రాజెక్టు గురించి పట్టించుకోకుండా పల్నాడు ప్రజలను దారుణంగా మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జలవనరుల శాఖ మంత్రి పల్నాడు ప్రాంతం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్నా ప్రయోజనం ఏమిటని ప్రశ్నింకారు. అరవిందబాబు మాట్లాడుతూ అభివృద్ధి పరంగా ఆంధ్రప్రదేశ్ చివరి స్థానంలో ఉందని, విదేశాలకు డ్రగ్స్ ఎగుమతిలో మాత్రం మొదటి స్థానంలో ఉందని ఎద్దేవ చేశారు. కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ ఇసుక మాఫియా మొత్తాన్నీ ప్రభుత్వమే నడిపిస్తోందని, దీన్ని ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని విమర్శించారు. ఈ ప్రభుత్వానికి ప్రజలే గుణపాఠం చెబుతారని అన్నారు. సమావేశంలో నాయకులు జి.నాగేశ్వరరావు, షేక్ కరీముల్లా, పి.సునీల్, కె.లక్ష్మి, ఎ.సుబ్బారావు, కె.కోటిరెడ్డి, కె.హనుమంతరావు, ఎస్.కుమార్, రాంబాబు, ఆంజనేయులు, బాలరాజు, రవిశంకర్, కొండలు, జనార్దన్‌బాబు, పూర్ణచంద్రరావు, షరీఫ్ పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల స్వచ్ఛభారత్

ప్రజాశక్తి-విజయపురిసౌత్

స్థానిక ఎపిఆర్‌డిసి ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఆదివారం విజయపురిసౌత్‌లో స్వచ్ఛ భారత్ చేపట్టారు. కళాశాల ఆవరణ, లాంచీ స్టేషన్, అంబేద్కర్ సెంటర్ ప్రాంతాల్లో చెత్తా చెదారాన్ని, రహదారులకు ఇరువైపులా ఉన్న ముళ్ల చెట్లు, పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మహమ్మద్ బాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వాటానూ జమ చేయాలి

ప్రజాశక్తి-క్రోసూరు

సిపిఎస్ ఉద్యోగుల ప్రాన్ ఖాతాకు జీతం నుండి మినహాయించిన 10 శాతానికి ప్రభుత్వ వాటా 10 శాతాన్ని కలిపి ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని ఎస్‌టియు పల్నాడు కన్వీనర్ టి.శరత్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఉద్యోగస్తులకు చెల్లించాల్సిన డిఎ బకాయిలనూ చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - మాచర్ల

వైద్య రంగానికి సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యం ఇస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనారోగ్యంపాలైన ఇద్దరికి సిఎం సహాయ నిధి చెక్కులను తన కార్యాలయంలో ఆదివారం ఆయన అందించారు. గుండా రోశయ్యకు రూ.1.60 లక్షలు, ఎం.రోసమ్మకు రూ.60 వేలు చెక్కును ఇచ్చారు.

సాగరమాత ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు

ప్రజాశక్తి-విజయపురిసౌత్

విజయపురిసౌత్‌లోని సాగరమాత ఆలయంలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. విచారణ గురువు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ సందేశాన్నిచ్చారు.

'నా ఉద్యోగం నాకే ఇవ్వాలి'

ఏపి పాఠశాలలో పని చేస్తున్న వంట మనిషి ఆశీర్వాదం

ప్రజాశక్తి - తాడికొండ

తాను చేసుకునే ఉద్యోగాన్ని తనకే ఇవ్వా లని తాడికొండ ఏపి పాఠశాలలో పని చేస్తున్న వంట మనిషి కొలికిపూడి ఆశీర్వాదం కోరారు. ఆశీర్వాదం ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో తన గోడు వెళ్ళబోసుకున్నారు. ఆశీర్వాదం వివరాల ప్రకా రం తాడికొండ గ్రామ ఏపి పాఠ శాలలో ఆమె గత రెండేళ్లుగా వంట మనిషిగా, అదే పాఠశాలలో చలి వేంద్రం రమాదేవి హెల్పర్ గా పనిచేస్తున్నారు. అయితే,రాజకీయ కారణాలతో ఆశీ ర్వాద మును హెల్పర్‌గా, రమాదేవిని వంట మని షిగా నియ మిస్తూ రెండు రోజుల క్రితం ఎంఇఒ తెనాలి ఇందిర ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. వంట మనిషిగా పని చేస్తున్న తనను పక్కన పెట్టి ఆ పోస్టులో రమాదేవిని నియమిం చాల్సిన అవ సరం ఏమిటని ఆమె ప్రశ్నించారు. లంచాలకు మరిగిన ఎంఇఒ తనను పక్కన పెట్టి, ఈవిధంగా చేశారని ఆరోపించారు. ఈ విషయాన్ని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లిన తనకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రార్థన మందిరానికి టిడిపి విరాళం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరం గ్రామానికి చెందిన తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధు సూదన్‌రావు స్థానిక హల్లెలూయ ప్రార్ధన మందిరానికి రూ.2 లక్షల రూపా యలు విరాళాన్ని, 100 బస్తాల సిమెంటును పార్టీ నాయకులతో కలిసి మందిరం సంఘ కాపరికి ఆదివారం అందజేశారు.టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ పిలుపు మేరకు ఈ విరాళం అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో టిడిపి తాడేపల్లి మండల అధ్యక్షులు ఎ.సుబ్బారావు, మంగళగిరి నియోజకవర్గం అబ్జర్వర్ సత్యనారాయణ, తెలుగు మహిళ తాడేపల్లి మండల అధ్యక్షురాలు బి.కృష్ణవందన, టిడిపి గ్రామ అధ్యక్షులు ఈపూరి కోటయ్య, పార్టీ ప్రధాన కార్యదర్శి పి.సుబ్బారావు, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి ఎస్‌కె వలి పాల్గొన్నారు.

టిడిపి నాయకులు కాట్రగడ్డ మధు వితరణ

షుగర్ వ్యాధి కారణంగా కాలు కోల్పోయిన ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరానికి చెందిన టిడిపి కార్యకర్త షేక్ నాగూర్ కు ఆది వారం ఉదయం టిడిపి నాయకులు కాట్రగడ్డ మధు సూదన్‌రావు రూ. 10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. టిడిపి గ్రామ ప్రధాన కార్యదర్శి పి.సుబ్రహ్మణ్యం, తెలుగు యువత నాయకులు నాగూర్ వలి పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి ప్రతి ఏటా రూ.2 లక్షలు

ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్

డిజిటల్ బోర్డు స్విచ్ ఆన్ చేస్తున్న ప్రవాసాంధ్రుడు, దాత పూర్ణచంద్రరావు

ఇకపై తాను ఈ పాఠశాలకు తన జీవితాంతం ప్రతి ఏడాది రూ.2 లక్షలను లైన్స్ మాంటిసోరి స్కూల్ అభివృద్ధి నిమిత్తం అంద జేస్తానని ప్రవాస ఆంధ్రుడు, పాఠ శాల ప్రధాన దాత తాళ్లూరి పూర్ణ చంద్రరావు అన్నారు. ఆదివారం స్థానిక లైన్స్ మాంటిసోరి సిబిఎస్‌ఇ స్కూల్ లో 1 నుండి 10వ తరగతి వరకు నూతనంగా ఏర్పాటు చేసిన స్మార్ట్ క్లాసుల గదులతో పాటు డిజి టల్ బోర్డులను బటన్ నొక్కి ఆయన ప్రారంభించారు. 9 క్రీడా మైదా నాలను బ్రేక్ ఇన్‌స్పెక్టర్ శివ నాగే శ్వరరావుతో పాటు పలువురు దాతలు ప్రారంభించారు. అనం తరం ఏర్పాటు చేసిన సభకు పాఠ శాల అధ్యక్షులు అరవపల్లి కృష్ణ అధ్య క్షత వహించారు. పూర్ణచంద్ర రావు మాట్లాడుతూ ఈ ప్రాంతానికి 30 కిలోమీటర్ల దూరంలో ఏ పాఠ శాలలో లేని విధంగా లైన్స్ మాంటి సోరి పాఠశాలలో సి.బి. ఎస్.ఇ .ప్రవేశపెట్టిన విషయాన్ని ప్రస్తా వించారు. పేద,బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అం దించాలనే లక్ష్యంతో దాతల సహకారంతో స్మార్ట్ క్లాస్ తరగతి గదులను ఏర్పాటు చేసిన పాలకవర్గ గౌరవ అధ్యక్షులు దాసరి శేషగిరిరావు సెక్రెటరీ కరస్పాండెంట్ ముద్దన నగ రాజకుమారిల కృషి తనకు ఎంతో సంతృప్తి నిచ్చిందని అన్నారు.ఉపాధ్యక్షులు ముద్దన రాఘ వయ్య మాట్లాడుతూ కారం చేడుకు చెందిన దాత పూర్ణచంద్ర రావు 45 ఏళ్లుగా అమెరికాలో ఉంటూ దేశ భక్తితో మన ప్రాం తంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. ఈ సందర్భంగా పాఠశాల పాలక వర్గం పూర్ణచంద్రరావును, నంబూరి శివ నాగేశ్వరావు సునీత. దాసరి శేష గిరిరావు కుసుమాంబ దంపతులను ఘనంగా సత్కరించారు.

అనంతరం పాఠశాల చిన్నా రులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విశ్రాంతి ప్రధానో పాధ్యాయిని మరి యమ్మ, ఎస్‌పిఎస్ ప్రిన్సిపాల్ శాంతకుమారి, దాతలు గేరా రత్నం, డి.సత్యనారాయణ, డిఎల్‌ఎస్ ప్రసాదు. ఆర్.శివరామ కృష్ణయ్య, కె.వెంకటేశ్వర్లు. ప్రిన్సిపాల్ కిరణ్ జోష్, కె.ఉమ, విద్యాసాగర్ గుప్త పాల్గొన్నారు.

నరాల సంబంధిత వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి-తెనాలి

డాక్టర్ పవన్‌కుమార్‌ను సత్కరిస్తున్న అసోసియేషన్

వృద్ధాప్యంలో సంభవించే నరాల సంబంధిత వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ న్యూరోసర్జన్ డాక్టర్ బడుగు పవన్‌కుమార్ చెప్పారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం ఆదివారం రాత్రి స్థానిక నందులపేట కవిరాజాపార్కు లోని విజికే భవన్‌లో మొవ్వా సత్యనారాయణ అధ్యక్షతన జరి గింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ పవన కుమార్ 'వృద్ధాప్యం-నరాల సంబంధిత సమస్యలు' అంశంపై ప్రసంగించారు. వయసు పైబడిన వారిలో శారీరక బల హీనతల కారణంగా నరాల సంబంధిత వ్యాధులు, సమ స్యలు తలెత్తుతాయన్నారు. వీటిపై అప్ర మత్తంగా ఉండి వైద్యులను సంప్రదించాలన్నారు. వ్యాధులు రావటానికి కారణాలు, నివారణోపాయాల గురించి వివరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ తరఫున ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి బొమ్మదేవర వెంకటేశ్వరరావు, ఎస్.నాగేం ద్రయ్య పాల్గొన్నారు.

భవనాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదానశీం

మహాప్రస్థానంలో భవనం ప్రారంభం

ప్రజాశక్తి-తెనాలి

స్థానిక బుర్రిపాలెం రోడ్డు మహాప్రస్థానంలో ఢాకా లక్ష్మి రెడ్డి, లక్ష్మమ్మ పేరిట నూతనంగా నిర్మించిన సామాజిక భవ నాన్ని చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నశీం ఆదివారం ప్రారం భించారు. ఈ సందర్భంగా సామాజిక దృక్పథంతో సామాజిక భవన నిర్మాణానికి సహకరించిన దాతలను అమె అభినందిం చారు.కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త కె.సుబ్ర హ్మణ్యం, ఎ.వెంకటేశ్వరరావు, మహాప్రస్థానం అధ్యక్ష కార్య దర్శులు డి.సాంబిరెడ్డి, జె.శివరామకృష్ణ, కోశాధికారి బి. సాంబశివరావు, శంకరప్రసాద్, ఎం.సత్య నారాయణచౌదరి, వి.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు ఉపకారవేతనం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న బాల బాలికలు జాతీయ ఉపకార వేత నాల పరీక్షకు హాజరయ్యారు. హాజరైన వారిలో పదిమంది బాల బాలికలు ఉపకార వేతనాలకు ఉత్తీర్ణత సాధించి, అర్హత సాధిం చినట్లుగా మున్సిపల్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎస్. శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. ప్రతిభ కనబరిచిన పది మంది విద్యార్థులకు ఇంటర్మీడియట్ పూర్తయ్యే వరకు సం వత్స రానికి రూ.12,000 చొప్పున ఉపకార వేతనం ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. విద్యా ర్థులకు శిక్షణ ఇచ్చిన ఉపా ధ్యాయులను, ఉత్తీర్ణత సాధించిన బాలబాలికులను అభి నందిస్తున్నట్లుగా తెలిపారు.

మాతృసేవ సంక్షేమ సంఘం అన్నదానం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి దేవస్థానం సెంటరులో చినకాకాని శ్రీ పేద అనాధల మాతృసేవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సేవా సంఘం ఆధ్వ ర్యంలో గత రెండు సంవత్సరాల నుంచి ప్రతి నెలా 2, 4 ఆది వారాల్లో పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వ హిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం సుమారు 250 మందికి అన్న దానం చేశారు. కార్యక్రమంలో సేవా సంఘం ప్రతి నిధులు ఎల్.శ్రీరామ్మూర్తి, ఎస్.నాగేశ్వరరావు, సిహెచ్ వెంకట నర సయ్య, పి.పూర్ణచంద్రరావు, వై. శివనాగేశ్వరరావు, ఎం హను మంతరావు తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలతో కూడిన విద్యనందించాలి

రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు (కృష్ణాజిల్లా)

విద్య నైతిక విలువలతో ఉండాలని, జ్ఞాన సముపార్జన సమాజ శ్రేయస్సుకు ఉపయోగకరంగాఉండాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కె హేమచంద్రారెడ్డి అన్నారు. స్థానిక శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ ఆవిర్భవించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 25వ వార్షికోత్సవ వేడుకలు కళాశాల ప్రాంగణంలో శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ 'ఇంజనీర్' వల్లూరుపల్లి సత్యనారాయణరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా కె.హేమచంద్రారెడ్డి మాట్లాడారు. ఇంజనీరింగ్ విద్య ఎంతో ఉత్కృష్ట మైనదన్నారు. దానిని అభ్యసించడం పూర్వజన్మ సుకృతంగా ఆయన అభివర్ణించారు. మనిషి విజయం దిశగా అడుగులు వేసేటప్పుడు అవరోధాలు ఎదురవుతాయన్నారు. వాటిని అధిగమించిన నాడే విజయం సొంతమవుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వి.ఎస్.ఎన్.ఆర్.వి. ప్రసాద్ వార్షిక నివేదికను సమర్పించారు. గత సంవత్సర కాలం పాటు కరోనా విపత్కర పరిస్థితిల్లో సైతం కళాశాల సాధించిన ప్రగతిని వివరించారు. కళాశాల 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గత నెల రోజులుగా విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి వివిధ సాంస్కృతిక, క్రీడా పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. హేమచంద్రారెడ్డిను కళాశాల ప్రిన్సిపల్ డా.జి.వి.ఎస్.ఎన్.ఆర్.వి. ప్రసాద్ తదితరులు దుశ్శాలువా, పుష్పగుచ్ఛం, జ్ఞాపికతో గౌరవంగా సత్కరించారు. అనంతరం అన్ని రంగాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలను, నగదు బహుమతులను, మెరిట్ కమ్ మీన్స్ అవార్డు ఫర్ నీడి బెస్ట్ అడ్మిటెడ్ స్టూడెంట్ ఇన్ బిటెక్ ఆఫ్ ఎస్‌ఆర్‌జిఇసి, సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలన్సీ అవార్డులను ముఖ్యఅతిథి ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి, ప్రెసిడెంట్, ప్రమోటర్ సొసైటీ వి.సుబ్బారావు, వైస్ ప్రెసిడెంట్ ప్రమోటర్ సొసైటీ కేవీ కృష్ణారావు, కో సెక్రటరీ అండ్ కో కరస్పాండెంట్ వల్లూరుపల్లి రామకృష్ణ చేతుల మీదుగా అందజేశారు. సుమారుగా రూ.7.33 లక్షల నగదు బహుమతులుగా అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.బ 2015, 2016, 2017, 2018 విద్యా సంవత్సరాలకు ఉత్తమ విద్యార్థి కేటగిరిలో వరుసగా ఇంకొల్లు ప్రియాంక, తలుపుల రవితేజ, ఉదత్తు మానస, తూరగ కృష్ణ కౌశిక్‌లకు బంగారు పతకాలు, రూ.10 వేలు నగదు, ఉత్తమ మహిళా విద్యార్థి కేటగిరిలో వరుసగా ఇంకొల్లు ప్రియాంక, అతుకూరి శ్రీ లక్ష్మీ పూజిత, ఉదత్తు మానస, సిరాజున్నిసలకు బంగారు పతకం, రూ.5,000 నగదును హేమచంద్రారెడ్డి అందశారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ వి.సత్యనారాయణరావు, కో సెక్రెటరీ అండ్ కో కరస్పాండెంట్ వి.రామకష్ణ, ప్రమోటర్ సొసైటీ అధ్యక్షులు వి.సుబ్బారావు, ఉపాధ్యక్షులు కేవీ కృష్ణారావు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కోదండరామారావు, డాక్టర్ ఎంఆర్‌సిహెచ్ శాస్త్రి, డైరెక్టర్ డాక్టర్ బి.కరుణ కుమార్, యాజమాన్య సలహాదారులు డాక్టర్ పి.రవీంద్రబాబు, కన్వీనర్ డాక్టర్ కే ఎన్ ప్రకాష్, కో కన్వీనర్ డాక్టర్ సిహెచ్ సురేష్, వివిధ కార్యక్రమాల నిర్వాహకులు, విభాగాధిపతులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న కె.హేమచంద్రారెడ్డి

క్రెడాయ్ ఏపీ ఛైర్మన్‌గా ఆళ్ల శివారెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

క్రెడాయ్ ఆంధ్రప్రదేశ్ ఛాప్టర్ నూతన ఛైర్మన్‌గా గుంటూరుకు చెందిన ప్రముఖ బిల్డర్ ఆళ్ల శివారెడ్డి ఎన్నికయ్యారు. ఆయన 2023-25 వరకూ ఈ పదవిలో ఉంటారు. మార్చి 26న విశాఖ పట్టణంలో జరిగిన నూతన కార్యవర్గ ఎన్నికలో శివారెడ్డి ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. శివారెడ్డి బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఐదుసార్లు పనిచేశారు. క్రెడాయ్ గుంటూరు ఛాప్టర్ ఏర్పడినప్పుడు గుంటూరు ప్రెసిడెంట్‌గా కూడా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని క్రెడాయ్ సభ్యుల అభివృద్ధికి పాటుపడతానని, ఇటు ప్రభుత్వం, అటు బిల్డర్లకు అనుసంధానంగా వ్యవహరిస్తారని అన్నారు. బిల్డర్ల ప్రాధాన్యతను గుర్తించి, రాష్ట్ర ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

పోస్టర్స్ ఆవిష్కరిస్తున్న మోసెస్‌పాల్, తదితరులు

రోడ్డు ప్రమాదాల నివారణ యువతతోనే సాధ్యం

ప్రజాశక్తి-గుంటూరు

రోడ్డు ప్రమాదాలను నివారించాలంటే యువతలో వచ్చే మార్పుతోనే సాధ్యమవుతుందని జిల్లా సీసీఎస్ డీఎస్పీ బీ.మోసెస్‌పాల్ అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ఆదివారం విజ్ఞాన్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 'రోడ్డు భద్రత' అనే అంశంపై అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మోసెస్‌పాల్ మాట్లాడుతూ దేశంలో యువత పెద్ద సంఖ్యలో ఉందని, అయితే రోడ్డు ప్రమాదాల బారిన పడి చనిపోయే వారిలో ఎక్కువ మంది యువతేనని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలకు గురై తల్లిదండ్రులకు గుండెకోత మిగల్చరాదన్నారు. ప్రాణం ఎంతో విలువైనదని, ఏ ఒక్కరూ రోడ్డు ప్రమాదాల్లో మరణించకూడదనే ఉద్దేశ్యంతో అన్ని రకాలుగా కృషి చేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలన్నారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ టీ.రాఘవరావు మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ర్యాష్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ వంటి నేరాలను చేయకూడదన్నారు. వాహనం నడిపే ప్రతి ఒక్కరి దగ్గర డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ సర్టిఫికెట్, పొల్యూషన్ సర్టిఫికెట్‌లు ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్‌ఆర్టీసీ కన్సల్టెంట్ ఎం.డీ. హనీఫ్ మాట్లాడారు. అనంతరం రోడ్డు భద్రతా నిబంధనలపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'ధూంధో' మొబైల్ అప్లికేషన్ ఫర్ పేరెంట్ అనే యాప్ గురించి వివరించారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ వైస్ ఛైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విరసం, పిడియం నాయకులు

ఫాసిస్టు ప్రభుత్వాలపై ఐక్య పోరాటాలు

ప్రజాశక్తి-గుంటూరు

హిందూ జాతీయ వాదం పేరుతో ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తున్న ఫాసిస్టు ప్రభుత్వాలను గద్దె దించటం ఐక్య ప్రజాస్వామిక ఉద్యమాల ద్వారానే సాధ్యమని విప్లవ రచయితల సంఘం రాష్ట్ర నాయకురాలు వరలక్ష్మి పేర్కొన్నారు. దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ మూమెంట్) ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖదేవుల 92వ వర్ధంతి వారోత్సవాల ముగింపు సభను స్థానిక బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ బిజెపి హిందూత్వ శక్తులు చెబుతున్న జాతీయ హిందూ సంస్కృతిని బౌద్ధ, జైన మతాలు, ఆదివాసీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని అన్నారు. బ్రిటిష్ కాలం నుండి నేటి వరకు పాలక పార్టీలు దోపిడీదారుల పక్షానే నిలుస్తున్నాయని విమర్శించారు. వీక్షణం పత్రిక సంపాదకులు ఎన్.వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రధాని మోడీ పాలన అదాని వత్తాంతంతో ఫాసిస్టు వ్యతిరేక ఐక్య సంఘటనలు రావలసిన అవసరాన్ని నొక్కి చెబుతున్నాయని తెలియజేశారు. మోడీ పాలన హిట్లర్, ముసోలిని, ట్రంప్ వంటి ఫాసిస్టుల పాలనను పోలి ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ కమిటీ కన్వీనర్ రమేష్ పట్నాయక్ మాట్లాడుతూ జ్ఞానాన్ని అణిచివేసి, పితస్వామ్య వ్యవస్థకు పునాదులు వేయటం ద్వారా మనుధర్మ శాస్త్రం ఆవిర్భవించిందని, సాటి మనుషులను మనుషులుగా గుర్తించి గౌరవించే సంస్కృతి లేదని చెప్పారు. పిడిఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేష్ ప్రారంభ ఉపన్యాసం చేశారు. పిడిఎం రాష్ట్ర అధ్యక్షులు కె.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో 'అదాని ప్రకంపనలు - వ్యవస్థాగత సంక్షోభానికి ఉదాహరణ' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఎస్ఆర్ ప్రసాద్, నల్లూరి రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

సదుపాయాలు కల్పిస్తే ఆంధ్రాకు సినీ పరిశ్రమ

ఆలయాన్ని సందర్శించిన దర్శకుడు రాఘవేంద్రరావు, నటుడు రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్



మంగళగిరి మండలం పెద్దవడ్లపూడి లోని శ్రీ భగవాన్ సత్యసాయి షిర్డీ సాయిబాబా ఆలయాన్ని ప్రముఖ దర్శకుడు కె.రాఘ వేంద్ర రావు, నటుడు రాజేంద్ర ప్రసాద్ ఆదివారం సందర్శించారు. వీరికి ఆలయ చైర్మన్ పాతూరి నాగభూషణం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాఘవేంద్రరావు ప్రస్తుత రాజకీయాల గురించి మాట్లాడుతూ రాజకీయాల్లోకి ధనానికి ప్రాధాన్యత లేకుండా మంచివారిని రానివ్వాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో టూరిజం డెవలప్‌మెంట్ చేసి మంచి సదుపాయాలు కల్పిస్తే ఆంధ్రాకు సినీ పరిశ్రమ వస్తుందని అన్నారు. సినీ గేయ రచయిత చంద్రబోస్, మ్యూజిక్ డైరెక్టర్ కీరవాణి తనకు ప్రియ శిష్యులని చెప్పారు. రాజమౌళి కష్టపడే తత్వంగలవాడని అభినందించాడు. తెలుగు చిత్ర పరిశ్రమకు ఆస్కార్ రావడం శుభపరిణామని ఇందుకు వారందని అభినందిం చాలని అన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాతూరి శ్రీను, సెక్రెటరీ సుబ్బారావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై కక్షసాధింపు చర్యలు సరికాదు : యుటిఎఫ్

ప్రజాశక్తి-గుంటూరు

ఉపాధ్యాయులను చిన్న చిన్న కారణాలతో సస్పెండ్ చేయటం, ఇంక్రిమెంట్లు నిలుపుదల చేయటం, కోత కోయటం సమంజసం కాదని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, యం.కళాధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యను బట్టి చర్యలు ఉండాలని, అన్నిటికీ ఒకే విధంగా చర్యలు తీసుకుంటూ, సస్పెండ్‌లు చేయటం సరికాదన్నారు. ఇటీవల ఉపాధ్యాయులపై ఉద్దేశపూర్వకంగా కక్షసాధింపు చర్యలు పెరిగాయని అన్నారు. ఈ విధానం మారకపోతే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ప్రాథమిక పాఠశాలలో ఒకరిద్దరు టీచర్లతో పడుతున్న ఇబ్బందులను పట్టించుకోకుండా సస్పెండ్ చేసి, ఇంక్రిమెంట్లు ఆపటం మంచి పరిణామం కాదన్నారు. పై అధికారుల ఒత్తిడితో ఇలాంటి చర్యలు తీసుకోవటం పెరిగిపోయాయన్నారు. ప్రతి మండలంలోనూ వెతికి వెతికి పాత విషయాలను కూడా బయటకు తీసి సస్పెండ్ చేసి, నివేదికలు తయారు చేసుకోవటం దిగజారుడుతనానికి నిదర్శమని పేర్కొన్నారు. ఇదే విధానం భవిష్యత్‌లో కొనసాగితే ఆందోళన తప్పదని హెచ్చరించారు.

క్షయపై అప్రమత్తత అవసరం

ఆరునెలల పాటు మందులు వాడాలి

ప్రజాశక్తితో పల్నాడు జిల్లా క్షయ నియంత్రణాధికారి డాక్టర్ పద్మావతి

ప్రజాశక్తి-నర్సరావుపేట

క్షయవ్యాధి గ్రస్తులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పల్నాడు జిల్లా లెప్రసి,ఎయిడ్స్,క్షయవాధి నియంత్రణ అధికారి డాక్టర్ పద్మావతి అన్నారు. క్షయ వ్యాధి గ్రస్తుల పట్ల వివక్ష తగదన్నారు. వ్యాధి గ్రస్తులు వ్యాధి ఉధతి పెరగకుండా స్వీయ నియంత్రణలో ఉండాలన్నారు. ప్రభుత్వం ఉచితంగా మందులు అందచేస్తుందని,దాతల సాయంతో పౌష్టికాహారం కూడా అందిస్తుందన్నారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూ లో ఆమె పలు అంశాలు తెలియజేశారు.

జిల్లాలో ఎంత మంది వ్యాధిగ్రస్తులు ఉన్నారు?

క్షయ లేదా టిబి అనేది మైకోబాక్టీరియం ట్యూబర్ క్యూలోసిస్ అనే బాక్టీరియా వల్ల కలిగే అంటు వ్యాధి. క్షయ వ్యాధి సాధారణంగా దగ్గు, తుమ్ముల సమయంలో గాలిలోకి విడుదలయ్యే తుంపరల ద్వారా ఒకరి నుండి మరొకరికి వ్యాపిస్తుంది. జిల్లాలో 2190 మందిని గుర్తించి చికిత్స అందిస్తున్నాం. 15 రోజులుగా దగ్గు జలుబు, కళ్లెలో రక్తం పడడం ఛాతిలో మార్పు ఉండట బరువు తగ్గుటం వంటి లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వైద్యుని సలహా మేరకు చికిత్స పొందాలి. క్షయ వ్యాధిగ్రస్తులకి ప్రభుత్వం ప్రతి నెల ఆర్థిక సహాయం కింద రూ. 500 అందజేస్తుంది.

ప్రధానమంత్రి టీబీ ముక్త భారత అభియాన్ ప్రోగ్రామ్ కింద జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లాలోని 1781 మంది వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకొని ప్రతి నెల క్షయ మిత్ర కార్యక్రమం ద్వారా పోషక విలువలు కలిగిన బలవర్ధక ఆహార పదార్థాలు పంపిణీ చేస్తున్నారు.

వ్యాధి లక్షణాలు ఎలా ఉంటాయి ?

15 రోజుల పాటు దగ్గు రావడం జలుబు, సాయంత్రానికి శరీరం వేడెక్కడం, చెమటలు పట్టడం, సాధారణం కంటే బరువు తగ్గడం, దగ్గినపుడు చారలుగా కళ్లె పడడం, నీరసించడం వంటి లక్షణాలు క్షయ వ్యాధి గ్రస్తులలో కనిపిస్తాయి. కొన్ని కొన్ని సందర్భాలలో ఈ లక్షణాలు లేకపోయినప్పటికీ ఊపిరితిత్తుల పరీక్షలు చేసిన కొన్ని సందర్భాలలో కూడా ఈ వ్యాధి గ్రస్తులను కనుగొనడం జరుగుతుంది.

వ్యాధి నివారణ ఎలా? పర్యవేక్షణ ఎలా ఉంది?

క్షయ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి చికిత్స పొందడంతో పాటు పోషకాహారం తీసుకుంటూ క్రమం తప్పకుండా మందులు వాడుకోవడం ద్వారా వ్యాధిని పూర్తిగా నివారించేందుకు అవకాశం ఉంది. మందులు సక్రమంగా వినియోగిస్తున్నారా లేదా వారి ఆరోగ్య పరిస్థితి ఎప్పటికప్పుడు ప్రాథమిక వైద్య

సిబ్బంది వెల్నెస్ సెంటర్ల సిబ్బంది పర్యవేక్షణ చేస్తున్నారు. పి హెచ్ సి ఎల్ లో అందు బాటులో ఉన్న మందులను బాధితులకు చేరవేసే విధంగా వైద్య సిబ్బంది కృషి చేస్తున్నారు.

మందులు ఇస్తున్నారా?

జిల్లాలో ఉన్న అన్ని పి.ఎ.సి మరియు పి.హెచ్.సి లలో హెల్త్ వెల్ నెస్ సెంటర్లలో ఆర్.టి.పి.సి.ఆర్, సిబిఎన్ఎఎటి కిట్లు మరియు డీఎంసీలు అందుబాటులో ఉన్నాయి.

ప్రభుత్వ సాయం కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలి?

వ్యాధి లక్షణాలు ఉండి నిర్ధారణ అయితే చికిత్స పొందే క్రమంలోనే ప్రభుత్వం నుండి పరిహారం కోసం ఎంపిక చేస్తాం. ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు. ఆరు నెలల పాటు రోగి ఖాతాలో రూ.500 చొప్పున జమ చేస్తాం.